MUNICIPAL CORPORATION | @DC_Nizampet

**10 ఏప్రిల్ 2026 నాటిది.**

Dear Citizen,
This office has issued the showcase notices and conducted personal hearings and issued speaking orders for the un authorized constructions. further it has been to STF team for man and machinery for demolition of unauthorized construction

| Sl.No. | Owner Name | Address | Show cause notice no. | Show cause notice date | Speaking order date | Demolished |
|---|---|---|---|---|---|---|
| 1 | Y.Prasad | H.No.3-5/81, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | G1/UC/W-64/W-15/NMC/2025 | 23.07.2025 | 04.08.2025 | 22.11.2025 |
| 2 | J.narender | H.No.3-5/90, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | 58/UC/W-273/C-58/GHMC/2026 | 27.02.2026 | 30.03.2026 | Sent to STF team for further action |
| 3 | Kolan Mahender | H.No.3-5/93, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | 78/UC/W-273/C-58/GHMC/2026 | 28.02.2026 | 30.03.2026 | Sent to STF team for further action |
| 4 | Erra Raju | H.No.3-10/67, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | 80/UC/W-273/C-58/GHMC/2026 | 28.02.2026 | 30.03.2026 | Sent to STF team for further action |
| 5 | Venkataiah | H.No.3-7/7, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | 71/UC/W-273/C-58/GHMC/2026 | 27.02.2026 | 30.03.2026 | Sent to STF team for further action |
| 6 | K.Anjali | H.No.3-10/119, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | 79/UC/W-273/C-58/GHMC/2026 | 29.01.2026 | 30.03.2026 | Sent to STF team for further action |
| 7 | K.Swapna | H.No.3-5/81, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | 83/UC/W-273/C-58/GHMC/2026 | 28.02.2026 | 30.03.2026 | Sent to STF team for further action |
| 8 | Vasu Babu | H.No.3-9/91, rajiv Gandhi nagar, Nizampet, Bachupally | 82/UC/W-273/C-58/GHMC/2026 | 28.02.2026 | 30.03.2026 | Sent to STF team for further action |

పెన్ పవర్ దినపత్రిక కథనాలతో ఎక్స్
ఖాతాలో అధికారుల సమాధానం..

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

# పేదల బస్తీలో.. ఆకాశహర్మ్యాలు




- నోటీసులు-స్పీకింగ్ ఆర్డర్లు..!జారీచేసి 5 నెల్లుగా 'ఎస్‌టిఎఫ్' చర్యలకై వెయిటింగ్..
- ఇప్పుడు 'ఎస్‌టిఎఫ్' రెడీగా ఉన్నా..! 'కూల్చివేతలు' ఏవి..?

- నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారుల బరితెగింపు విధులు..
- బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో 80గజాల్లో అక్రమ బహుళ అంతస్తులపై చర్యలేవి..?
- రాజీవ్‌గాంధీ నగర్‌లో 80 గజాల్లోనే బహుళ అంతస్తుల నిర్మాణాలు..
- అనుమతులు లేవని గుర్తించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు..
- 5 నెలల క్రితమే షోకాజ్ నోటీసులు.. వ్యక్తిగత విచారణలు..స్పీకింగ్ ఆర్డర్లు పూర్తి..!
- గత మార్చి 30న ఏడు అక్రమ నిర్మాణాలకు స్పీకింగ్ ఆర్డర్లు జారీ..
- కూల్చివేత కోసం ఎస్‌టిఎఫ్ టీమ్‌కు పంపినట్లు అప్పటి అధికారుల సమాధానం..
- ప్రస్తుతం సిఎంసి 'ఎస్‌టిఎఫ్' వ్యవస్థలు ఉన్నా..! కూల్చివేత చర్యలు శూన్యం..
- నెలలు గడుస్తున్నా రొటీన్ డైలాగ్ 'ఫర్‌దర్ యాక్షన్' పేరుతో ఫైళ్లకే చర్యలు పరిమితం..
- నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారులకు కనిపించలేదా..? అంటూ విమర్శలు..
- గచ్చిబౌలి ఘటన తర్వాతైనా ప్రమాదకర కట్టడాలపై చర్యల ప్రస్తావన ఏది..?

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 6:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ సర్కిల్-58 పరిధిలోని బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో అనుమతులు లేని బహుళ అంతస్తుల నిర్మాణాలపై అధికారుల చర్యలు కాగితాలకే పరిమితమయ్యాయా..? అనేప్రశ్నలు మరోసారి తెరపైకి వచ్చాయి. 80 గజాల స్థలాల్లోనే ఐదు, ఆరు అంతస్తుల వరకు నిర్మాణాలు జరుగుతున్నాయంటూ గత ఏప్రిల్ 9న 'పెన్ పవర్' ప్రచురించిన కథనానికి సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు అప్పట్లో స్పందించారు..షోకాజ్ నోటీసులు ఇచ్చామని.. వ్యక్తిగత విచారణలు నిర్వహించామని.. స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేశామని తెలిపారు.. తదుపరి చర్యల్లో భాగంగా కూల్చివేతల కోసం "ఎస్‌టిఎఫ్" టీమ్‌కు మ్యాన్ అండ్ మెషినరీ కోసం పంపామని నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం నుండి 'ఎక్స్'(ట్విట్టర్)లో స్పష్టంగా సమాధానం ఇచ్చింది.. అధికారులే స్వయంగా అందించిన ఆ చర్యల (లిస్ట్) పట్టికలోనూ ఈ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. అయితే నోటీసులు.. స్పీకింగ్ ఆర్డర్లు.. 'ఎస్‌టిఎఫ్' చర్యలకు పంపించడం కూడా పూర్తయిందని అప్పుడు విధుల్లో ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు.. ఆతర్వాత, పాత అధికారులు బదిలీలపై వెళ్ళారు.. వెంటనే దుండిగల్ సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగానికి చెందిన, ఏసిపి శ్రీనివాస్-టిపిఎస్ ముఖేష్ సింగ్‌లకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు.. ప్రస్తుతం గత జూలై 22న సిఎంసి కమిషనర్ శ్రీజన ఐఏఎస్ నేతృత్వంలో 'ఎస్‌టిఎఫ్' టీమ్‌ను పకడ్బందీగా నియమించారు.. ఈ నియామకం జరిగి దాదాపు 40 రోజులు గడిచినా, బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్ పేదల బస్తీలోని అక్రమ ఆకాశహర్మ్యాలపై కూల్చివేతలు ఎందుకు చేపట్టడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి..

-4లో




రాజీవ్‌గాంధీ నగర్ అనుమతుల్లేని ఆకాశహర్మ్యాలపై 2026 ఏప్రిల్ 9వ తేదీనాటి వార్త..

పేదల బస్తీలో 80 గజాల్లో ప్రమాదకర అక్రమ నిర్మాణం.. స్పీకింగ్ ఆర్డర్..







దాడి ఘటన వివరాల ఆధారంగా, ఏఐ ఊహాజనిత కార్టూన్ ఫొటో..

- ఆర్కే ఎంటర్‌ప్రైజెస్ ఇన్‌ఛార్జ్ యువరాజుపై విచక్షణారహితంగా దాడి..
- టూవీలర్‌పై వచ్చి వెంబడించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు..
- హెల్మెట్‌తో దాడి..తలకు తీవ్ర గాయాలు మల్లారెడ్డి నారాయణఆసుపత్రిలో చికిత్స..
- సీసీటీవీ ఆధారంగా నిందితుల కోసం దుండిగల్ పోలీసుల గాలింపు..

# దుండిగల్‌లో దారుణం..!
# యువకుడిపై హెల్మెట్‌తో దాడి..!




గుర్తు తెలియని వ్యక్తుల దాడి ఘటన నేపథ్యంలో ఏఐ రూపొందించిన కార్టూన్ ఇమేజ్

**దుండిగల్, పెన్ పవర్, సెప్టెంబర్ 6:**

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 24 ఏళ్ల యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి ఘటనపై స్థానికంగా కలకలం రేపుతోంది.. సారేగూడెం సమీపంలోని ఆల్కలి మెటల్స్ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకున్నట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు.. వివరాల్లోకి వెళ్ళితే.. ఆర్కే ఎంటర్‌ప్రైజెస్ ఓ ప్రైవేటు సంస్థలో ఇన్‌ఛార్జ్‌గా పనిచేస్తున్న యువరాజు (24) మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో గండి మైసమ్మ సిగ్నల్ దాటి ఆల్కలి మెటల్స్ సమీపంలో వెళ్తుండగా.. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి అతడిని వెంబడించినట్లు సమాచారం.. అనంతరం యువరాజుపై హెల్మెట్‌తో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.. ఇది గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం, సూరారంలోని మల్లారెడ్డి నారాయణ హాస్పిటల్‌కు తరలించారు.. ప్రస్తుతం యువరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది.. బాధితుడి ఫిర్యాదు మేరకు, దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు.దాడికి పాల్పడి పరారైన గుర్తుతెలియని వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు..దాడికి గల కారణాలు, నిందితుల వివరాలు పోలీసులదర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది...

# గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** గ్రామ సర్పంచులు నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకొని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. నిధుల విడుదల విషయంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో వచ్చిన చట్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలకు అభివృద్ధి నిధులు ఆగిపోకుండా.. నిధులు నేరుగా

-5లో


-5లో

# నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేసిన కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా రాష్ట్ర డీజీపీ సస్పెండ్‌తోనే సరిపెట్టారని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (ఖుజఊష్ట్రు) ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే.. అంతర్జాతీయ వేదికలపై ప్రభుత్వం తీరును ఎండగడతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో



# పేదల బస్తీలో.. ఆకాశహర్మ్యాలు..


రాజీవ్‌గాంధీ నగర్‌లో అనుమతుల్లేని అక్రమ నిర్మాణం..


రాజీవ్‌గాంధీ నగర్‌లో బయట రంగులు లోపల పనులు, స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చింది ఇదే..


రాజీవ్‌గాంధీ నగర్‌లో అక్రమ నిర్మాణం.. నో పర్మిషన్..

## చర్యల జాప్యంపై కమిషనర్ సమాధానం చెప్పాలి..!

నోటీసులు ఇచ్చారు.. వ్యక్తిగత విచారణలూ చేశారు.. స్పీకింగ్ ఆర్డర్లు కూడా ఇచ్చారు.. చర్యల కోసం 'ఎస్‌టిఎఫ్' టీమ్‌కూ పంపారు.. ఇదంతా 5 నెలల క్రితం మాట.. ఇప్పుడు ఎస్‌టిఎఫ్ టీమ్ కూడా ఉంది..! మరి కూల్చివేతలు ఎందుకు లేవు..? ఈ ఐదు నెలల వ్యవధిలో సెటిల్మెంట్‌లు చేసుకున్నారా..? పేదల బస్తీ రాజీవ్‌గాంధీ నగర్‌లో అక్రమ బహుళ అంతస్తులపై అధికారిక రికార్డుల్లో చర్యలన్నీ నమోదై ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయి చర్యల ఫలితం కనిపించకపోవడం గమనార్హం.. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సమగ్రంగా సమీక్షించి, పెండింగ్‌లోఉన్న అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు చేపట్టాలని, గచ్చిబౌలి తరహా ప్రమాద ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.. కాగితాలపై చర్యలు కాదు.. క్షేత్రస్థాయిలో కూల్చివేతలు కావాలని పలువురి డిమాండ్..! 5 నెలల క్రితం చర్యల కోసం 'ఎస్‌టిఎఫ్'కు పంపిన ఫైళ్లు ఇప్పుడైనా కదులుతాయా..? లేక అక్రమ నిర్మాణాలుగానే మిగిలిపోతాయా..? అన్నది ఇప్పుడు నిజాంపేట్ సర్కిల్ రాజీవ్‌గాంధీ నగర్ ఆకాశహర్మ్యాలు, గచ్చిబౌలి తరహా ప్రమాదాలు జరిగే వరకు నిజాంపేట్ టౌన్‌ప్లానింగ్ అధికారులు మౌనం వహిస్తారా అంటూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ఈ వ్యవహారంపై నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి డిప్యూటీ కమిషనర్ సమాధానం చెప్పాలని పలువురు కోరుతున్నారు..

## గచ్చిబౌలి ఘటనతోనైనా చర్యలు చేపడతారా..?

ఇటీవల గచ్చిబౌలి భవన ప్రమాద ఘటన నేపథ్యంలో అక్రమ, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాలపై ప్రజల్లో ఆందోళన పెరిగింది. ఈ నేపథ్యంలో రాజీవ్‌గాంధీ నగర్‌లో అధికారికంగా గుర్తించిన అక్రమ నిర్మాణాలపై ఇకనైనా చర్యలు తీసుకుంటారా..? లేదా అన్నది ఆసక్తిగా మారింది... ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే.. ప్రమాదకర నిర్మాణాలను ముందుగానే గుర్తించి నిలిపివేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందనే ఉద్దేశంతో, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సిఎంసి కమిషనర్ శ్రీజన చర్యలకు ఆదేశించినా..! సంబంధిత టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నలు లేవనెత్తుతోందని స్థానికులు పేర్కొంటున్నారు..

## నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్ 'ఎక్స్' సమాధానం..!

నిజాంపేట్ సర్కిల్ సిఎంసి అధికారులు, రాజీవ్‌గాంధీ నగర్ అక్రమ నిర్మాణాలపై ట్విట్టర్(ఎక్స్)లో అధికారికంగా అందించిన వివరాలను పరిశీలిస్తే.. రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన ఎనిమిది నిర్మాణాలపై చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.. వీటిలో వై. ప్రసాద్ నిర్మాణాన్ని 22-11-2025న కూల్చివేసినట్లు నమోదు చేశారు..మిగిలిన జె. నరేందర్, కొలన్ మహేందర్, ఎర్ర రాజు, వెంకటయ్య, కె. అంజలి, కె. స్వప్న, వాసుబాబులకు సంబంధించిన నిర్మాణాలపై 2026 ఫిబ్రవరి-మార్చి నెలల్లో షోకాజ్ నోటీసులు జారీ చేసి, 30-03-2026న స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేసినట్లు పట్టికలో ఉంది.అయితే వీటి ఎదురుగా "Sent to STF team for further action" అని పేర్కొన్నారు. మార్చి 30 నుంచి ఇప్పటివరకు నెలలు గడిచినా.. ఆ "ఫర్దర్ యాక్షన్" ఎక్కడ..? ఎప్పుడు..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు..

## 80 గజాల్లో గచ్చిబౌలి తరహా నిర్మాణాలు..?

రాజీవ్‌గాంధీ నగర్ ఒకప్పుడు పేదల కోసం ఏర్పాటు చేసిన బస్తీగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం చుట్టుపక్కల ప్రాంతాలు భారీగా అభివృద్ధి చెందాయి.. భూముల విలువలు పెరిగిన నేపథ్యంలో 80 గజాల స్థలాల్లోనే బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఎలాంటి అనుమతులు లేకుండా గచ్చిబౌలి ప్రమాద ఘటన తరహా భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు నిర్మిస్తుంటే, అధికారులు, చైన్‌మెన్‌లు ఏం చేస్తున్నారు.. అనుమతులు లేకపోతే నిర్మాణం ప్రారంభ దశలోనే గుర్తించి నిలిపివేయాల్సిన అధికారులు.. నిర్మాణాలు పూర్తయ్యే వరకు ఎలా కొనసాగనిచ్చారనే ప్రశ్నలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి..


బాచుపల్లి చౌరస్తాలో సీజ్ చేసి, చర్యల పెండింగ్.. అనుమతుల్లేని అక్రమ బహుళ అంతస్తులు.. ఫైల్‌ఫొటో..

## అక్రమ నిర్మాణాలు చేపడుతుండగా కనిపించలేదా..?

బహుళ అంతస్తుల నిర్మాణాలు ఒక్కరోజులో పూర్తయ్యేవి కాదు. నెలల తరబడి నిర్మాణ పనులు కొనసాగుతుంటాయి.. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది,. ఫీల్డ్ స్థాయి సిబ్బంది (చైన్‌మెన్‌లు) నిరంతరం పర్యవేక్షణలోనే ఉన్నప్పుడు ఇలాంటి నిర్మాణాలు పూర్తయ్యే వరకు అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమన్నది స్థానికుల ప్రధాన ప్రశ్న..అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు వచ్చిన తర్వాత, పత్రికల్లో వార్త వచ్చినతర్వాతే నోటీసులు ఇవ్వడం.. ఆ తర్వాత స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయడం.. చివరకు 'ఎస్‌టిఎఫ్' పంపామని చెప్పడం గమనార్హం.. అసలు అక్రమ నిర్మాణాలను అడ్డుకునే వ్యవస్థ ఉద్దేశం ఏమిటని..? స్థానికులు నిలదీస్తున్నారు. ఒకటి కూల్చారు..

## 'ఎస్‌టిఎఫ్ టీమ్' రెడీ.. చర్యలెక్కడ..?

అక్రమ నిర్మాణాల కూల్చివేత కోసం ప్రత్యేక "టాస్క్‌ఫోర్స్ టీమ్ (ఎస్‌టిఎఫ్)ను ఏర్పాటు చేసినప్పటికీ చర్యలు లేకపోవడం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. ఒకవైపు అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులు, విచారణలు, స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.. మరోవైపు ఎస్‌టిఎఫ్ టీమ్‌కు, చర్యలకోసం నివేదిక పంపామని చెప్పిన అక్రమ నిర్మాణాలపై, ఇప్పటికీ కూల్చివేతలు జరగకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై అనేక సందేహాలకు తావిస్తోంది.. అప్పుడు ఫైల్ టౌన్‌ప్లానింగ్ నుంచి 'ఎస్‌టిఎఫ్' టీమ్‌కు వెళ్లింది.. ఇప్పుడు ఆ ఎస్‌టిఎఫ్ టీమ్ సిద్ధంగా ఉంది..!మ్యాన్ అండ్ మెషినరీ సిద్ధంగా లేవా..? కూల్చివేతకు అడ్డంకులు ఏమిటి..? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సి ఉందని స్థానికులు అంటున్నారు..

# గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు

-3 పేజి తరువాయి

సర్పంచులకే అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో సర్పంచుల కోసం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా సర్పంచులు నాయకత్వం వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల ఆదర్శ గ్రామ అంశాలను సర్పంచులు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజయోగిని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ మాట్లాడుతూ.. సర్పంచులు నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

# నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి

-3 పేజి తరువాయి

విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు.మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు చెబుతున్నాయని, అవి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కల్లలు గానే మిగిలిపోయాయన్నారు. బీసీల కోసం ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడం పెద్ద జోక్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశం ఆ పార్టీ అంతర్గత విషయమన్నారు.

# దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



హైదరాబాద్ పెన్ పవర్:

పాడి గేదెల పెంపకంతో కుటుంబ ఆదాయం పెంచుకోవాలి

కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది

పరకాల ఇందిరా మహిళా డెయిరీ ద్వారా రాబోయే రెండు సంవత్సరాల్లో 40 వేలకుపైగా కుటుంబాలను సభ్యులుగా చేర్చుతాము

గీసుకొండ మండలం కొనాయమాకుల రైతు వేదికలో గీసుకొండ, సంగెం మండలాలకు చెందిన దళిత కుటుంబాలకు పాడి గేదెల యూనిట్ల మంజూరు పత్రాలను పరకాల శాసనసభ్యులు గౌరవ శ్రీ రేవూరి ప్రకాశ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 167 యూనిట్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.

కార్యక్రమానికి ముందు పశువైద్యులు లబ్ధిదారులకు పాడి గేదెల పెంపకం, పశువులకు అందించాల్సిన పోషకాహారం, వ్యాధుల నివారణ, టీకాల ప్రాముఖ్యత, వాతావరణ మార్పుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. దళిత కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెంది, స్వయం ఉపాధి ద్వారా తమ కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.పాడి గేదెల పెంపకం ద్వారా నిరంతర ఆదాయం పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చన్నారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పరకాల ఇందిరా మహిళా డెయిరీ ద్వారా రాబోయే రెండు సంవత్సరాల్లో 40 వేలకుపైగా కుటుంబాలను సభ్యులుగా చేర్చి, ప్రతి కుటుంబానికి రెండు పాడి గేదెలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.గేదెల పెంపకం కేవలం ఒక పథకం మాత్రమే కాకుండా కుటుంబాలకు దీర్ఘకాలిక ఆర్థిక భరోసాను కల్పించే మార్గమని అన్నారు.

# రాష్ట్ర సేవికాసమితి ఆధ్వర్యంలో భద్రకాళి ఆలయంలో సామూహిక ఘోష్ ప్రదర్శన.



హైదరాబాద్ పెన్ పవర్:

రాష్ట్ర సేవికాసమితికి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చారిత్రాత్మకమైన వరంగల్ భద్రకాళి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం" ప్రణవ నాదం" పేరుతో 90 మంది సేవికలు
నిర్వహించిన సామూహిక ఘోష్ ప్రదర్శన

భక్తులను, ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. క్రమశిక్షణ, దేశభక్తి, ఆధ్యాత్మిక చింతన కలబోతగా సాగిన ఈ కార్యక్రమం నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

హనుమకొండలోని ప్రసిద్ధి గాంచిన భద్రకాళి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ ఘోష్ ప్రదర్శన అత్యంత వైభవంగా జరిగింది.

రాష్ట్ర సేవికా సమితి సేవికలు శారీరక, మానసిక దృఢత్వానికి ప్రతీకగా ఈ ప్రదర్శనను నిర్వహించారు.

సమితికి చెందిన వివిధ వయసుల మహిళలు, యువతులు, బాలికలు సంప్రదాయ వేషధారణలో ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఆనక్ (డ్రమ్), వంశీ , ఝల్లరి,శంఖం వంటి వివిధ వాద్య పరికరాలతో సేవికలు స్వరాలను పలికించారు.

దేశభక్తిని పెంపొందించే వివిధ భారతీయ సాంప్రదాయ ట్యూన్స్ ను వాద్యాలపై అత్యంత ప్రతిభావంతంగా వాయించారు.

అమ్మవారి సన్నిధిలో జరిగిన ఈ ప్రదర్శన భక్తిరసంతో పాటు జాతీయ భావనను పెంపొందించేలా సాగింది.

మహిళల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, దేశ సేవ పట్ల అనురక్తిని పెంచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన రాష్ట్ర సేవికా సమితి తెలంగాణ ప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ ప్రొద్దుటూరి రూప తెలిపారు.

ధర్మ, సమాజ పరిరక్షణలో, సంస్కృతి పరిరక్షణలో మహిళల పాత్ర అత్యంత కీలకమైనదన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుకు సాగాలని, స్వదేశీ చింతనను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు.

ప్రాచీన యుద్ధ విద్యలు, వాద్య కళలు భారతీయ సంస్కృతిలో భాగమని వాటిని భావి తరాలకు అందించడమే తమ ధ్యేయమని తెలిపారు.

సమయ పాలన, క్రమశిక్షణే లక్ష్యంగా ప్రతిరోజూ పొందే శిక్షణకు ఈ ఘోష్ ప్రదర్శన ఒక నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

ఈ తరహా కార్యక్రమాలు యువతలో, ముఖ్యంగా బాలికల్లో సన్మార్గాన్ని, ధైర్యాన్ని నూరిపోస్తాయన్నారు.

ప్రదర్శన అనంతరం సేవికలందరూ భారతమాతకు ప్రణామం చేస్తూ ప్రార్థన నిర్వహించారు.

ధర్మ రక్షణ, సమాజ సేవ అనే రెండు కళ్ళుగా రాష్ట్రసేవికా సమితి పనిచేస్తుందని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ ప్రయోజనాల కోసం తమ వంతు కృషి చేయాలని ఆమె కోరారు.

భవిష్యత్తులో కూడా ఇటువంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఈ ఘోష్ ప్రదర్శన నగర ప్రజల మనస్సుల్లో ఒక ప్రత్యేకమైన దేశభక్తి ఆధ్యాత్మిక అనుభూతిని నింపింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వరంగల్ వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. మాలతి, విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అసిస్టెంట్ లెక్చరర్ కుమారి హరి విజయశ్రీ, జీవ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మంతెన శిరీష, రాష్ట్ర సేవికా సమితి తెలంగాణ ప్రాంత సంచాలిక డాక్టర్ మాగంటి అరుణ, తెలంగాణ ప్రాంత కార్యవాహిక శ్రీమతి శ్రీపాద రాధ, రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన వందలాదిమంది సేవికలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించా

రౌడీషీటర్లకు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ హెచ్చరిక

హైదరాబాద్ పెన్ పవర్:

వరంగల్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సూచించారు. పండుగ సందర్భంగా గణేష్ మండపాల ఏర్పాటు, ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, నిమజ్జనం కార్యక్రమాల సమయంలో ఎలాంటి గొడవలు, అల్లర్లు లేదా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని రౌడీషీటర్లను హెచ్చరించారు.

ముఖ్యంగా పాత నేర చరిత్ర ఉన్న వ్యక్తులు పోలీసుల నిఘాలో ఉంటారని, పండుగను ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా, గొడవలకు దిగినా లేదా ఇతరులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అదేవిధంగా మద్యం సేవించి బహిరంగ ప్రదేశాల్లో హంగామా చేయడం, యువతను రెచ్చగొట్టడం,



గణేష్ మండపాల వద్ద గొడవలకు పాల్పడటం, ఊరేగింపుల సమయంలో శాంతిభద్రతలకు భంగం కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు. పండుగ సందర్భంగా ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావివ్వకుండా సంయమనం పాటించాలని సూచించారు.

గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా, పోలీసుల సూచనలు మరియు నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

పండుగ సందర్భంగా పోలీస్ సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినాయక చవితి మరియు నిమజ్జనం కార్యక్రమాలను ప్రజలందరూ శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు సహకరించాలని ఇన్‌స్పెక్టర్ మంగీలాల్ కోరారు.

# అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రానికి శంకుస్థాపన చేసిన: మంత్రి వివేక్ వెంకటస్వామి..



హైదరాబాద్ పెన్ పవర్:

తారామతిపేట్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రం నిర్మాణానికి ఆదివారం ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో సైబర్ మెడోస్ వెంచర్‌లో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వివేక్ వెంకటస్వామి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై శంకుస్థాపనలో పాల్గొన్నారు. అంబేద్కర్ సాంస్కృతిక కేంద్రం నిర్మాణానికి ముందుకు వచ్చిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులను వారు అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సామాజిక సమానత్వం, విద్య, కళలు, సాంస్కృతిక విలువల ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ ఆలోచనలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిచేలా సాంస్కృతిక కేంద్రం పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# వరంగల్ భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమిషనర్



హైదరాబాద్ పెన్ పవర్:

వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును ఈ రోజు ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమీషనర్ శ్రీ చంద్రశేఖర్ ఆజాద్ ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ ఆజాద్ కి ఆలయ ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ ఆజాద్ ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేష మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఆజాద్ వెంట మాజీ కార్యనిర్వహణాధికారులు శ్రీ జ్ఞానదేవ్ రెడ్డి, శ్రీ రాజేంద్రం మరియు మేడారం ఈ.ఓ శ్రీ యం. వీరస్వామి, శ్రీ రత్నాకర్ శర్మ తదితరులున్నారు.

అనంతరం లివరంగల్ పోలీస్ కమీషనర్ శ్రీమతి శ్వేత కుటుంబ నతమేతంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు పూజానంతరం సి.పి కుటుంబ సభ్యులకు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు. ఈ రోజు ఆదివారం కూడా కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలు అమ్మవారిని దర్శించుకున్నారు.

# రాయపోల్‌లో ఘనంగా ఉట్ల పండుగ..



హైదరాబాద్ పెన్ పవర్:

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో ఉట్ల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం ఎదుట దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి డి. ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్ అచ్చన మమత శ్రీశైలం, ఉపసర్పంచ్ గోదాల శేఖర్‌రెడ్డి, కౌలు రైతు గోదాల శ్రీనివ్ష?సరెడ్డి ఆధ్వర్యంలో ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉట్ల కార్యక్రమంలో మహిళలు, పెద్దలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్లు కొట్టే కార్యక్రమంతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకను గ్రామస్థులు జయప్రదం చేశారు.

# మున్నేరు-పాలేరు కెనాల్ తీర్మానాలు వెనక్కి తీసుకోవాలి


మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 6:** గార్ల మండల ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి మున్నేరు పాలేరు లింక్ కెనాల్‌కు గ్రామ పంచాయతీల పేరుతో తీర్మానాలు చేయడం ఈ ప్రాంతానికి చారిత్రక ద్రోహమని మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్ ఆరోపించారు. ప్రజల ఓట్లతో ఎన్నికైన సర్పంచులు ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని అన్నారు. గార్ల మండల ప్రజల ఆకాంక్షలు, మనోభావాలను పక్కనబెట్టి కెనాల్‌కు అనుకూలంగా తీర్మానాలు చేయించడం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమేనని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల గార్ల మండలానికి కలిగే శాశ్వత సాగునీరు, తాగునీటి ప్రయోజనాలపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పష్టమైన వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.
గతంలో సీతారామ ప్రాజెక్టు విషయంలో గార్ల, బయ్యారం మండలాల రైతులకు అన్యాయం జరిగిందని, ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకోకుండా మళ్లీ మున్నేరు పాలేరు కెనాల్ పేరుతో రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని రమేష్ ప్రశ్నించారు. గత ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోయిన రైతుల సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. మున్నేరు ద్వారా గార్ల మండలంలోని ఏ మేరకు సాగుభూములకు శాశ్వత సాగునీరు అందుతుంది, స్థానిక రైతులకు కలిగే ప్రయోజనాలేమిటో స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. కేవలం నీటిని తరలించుకుపోయే ప్రాజెక్టుగా కాకుండా ఈ ప్రాంత రైతుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా ఎలాంటి హామీలు, ప్రణాళికలు ఉన్నాయో ప్రజలకు తెలియజేయాలని కోరారు. భవిష్యత్తులో గార్ల మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఎలాంటి శాశ్వత చర్యలు చేపడుతున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని రమేష్ అన్నారు. మున్నేరు పాలేరు కెనాల్ వల్ల స్థానిక ప్రజలకు కలిగే తాగునీటి ప్రయోజనాలపై సమగ్ర వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు. కెనాల్ నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతుల పునరావాసం, పరిహారం, ఉపాధి భద్రతపై ముందుగానే స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని నిర్వాసిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అన్నారు. గ్రామ పంచాయతీల్లో మున్నేరు పాలేరు కెనాల్‌కు సంబంధించిన తీర్మానాలు చేసే ముందు స్థానిక ప్రజల అభిప్రాయాలను తప్పనిసరిగా తీసుకోవాలని శీలంశెట్టి రమేష్ కోరారు. ప్రజాభిప్రాయాన్ని విస్మరించి తీసుకున్న తీర్మానాలను వెంటనే పునఃపరిశీలించి, అవసరమైతే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గార్ల, బయ్యారం మండలాల ప్రజలు, రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలనుఅంగీకరించబోమని, ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# అంగరంగవైభవంగా ముత్యాలమ్మ బోనాలు

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్:6** ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను ఆదివారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక ఇందిరానగర్ కాలనీలోని బైండ్ల కులస్తులు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా అలంకరించుకుని బోనాలను నెత్తిన ఎత్తుకుని మేళతాళాలు, డప్పుచప్పుళ్ల మధ్య గార్ల పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా ముత్యాలమ్మ గుడికి చేరుకున్నారు. ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరసారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గార్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పార్వతి హథీరామ్ నాయక్ దంపతులు అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించారు గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రతి కుటుంబంపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని ప్రార్థించారు. బోనాల వేడుకల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. డప్పుచప్పుళ్లు, మేళతాళాలు, భక్తుల సందడి మధ్య అమ్మవారి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించడంతో ముత్యాలమ్మ గుడి పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ప్రతి ఏడాది నిర్వహించే ముత్యాలమ్మ బోనాలను ఇందిరానగర్ బజారు బైండ్ల కులస్తులు ఐక్యంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ వైస్ ప్రెసిడెంట్ గంగావత్ లక్ష్మణ్ నాయక్ బైండ్ల కులస్తులు మహిళలు యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ కి పూజలు చేస్తున్న బైండ్ల కులస్తులు

# తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు

హైదరాబాద్: రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల (జుఎ ఎఘ్రుతీస్త్రఱఅస్త్ర ర్ఖఱశీఅం) ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీఓలు) కోసం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రెడ్కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలోని పలు ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీవోలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లోనూ 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (+జీఎస్టీ అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. 169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీ-బిడ్ సమావేశాలు
నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 22న ముగుస్తుందన్నారు. టెండర్లను తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాలని చెప్పారు.



# హైదరాబాద్ శివారులో కోడిపందేలు.. 22 మంది అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగర శివార్లలో నిర్వహిస్తున్న కోడి పందేలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేసి 22 మందిని అరెస్టు చేశారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడ ఆర్టీవో కార్యాలయం వెనుక ఓ పాత పౌల్ట్రీ ఫామ్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆదిభట్ల పోలీసులతో కలిసి శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు.
ఈ దాడుల్లో నిందితుల నుంచి రూ.3.60 లక్షలు, 31 పందెం కోళ్లు, 146 కోడి కత్తులు, 20 సెల్‌ఫోన్లు, స్కోర్ నోట్‌బుక్ స్వాధీనం చేసుకున్నారు. 3 కార్లు, 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకులు ఇతర ప్రాంతాల నుంచి బెట్టింగ్‌దారులను పిలిపించి, కోడి పందేల కోసం
ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిర్వాహకుడు, భూమి యజమాని పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కోడి పందేలు, జూదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



## ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు భారీగా తరలించిన భక్తులు


ముత్యాలమ్మ తల్లికి ముక్కులు చెల్లిస్తున్న భక్తులు

**ఖమ్మం, పెన్ పవర్, సెప్టెంబర్ 6:** ఆదివారం చివరి బోనాలు కావడంతో అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు భక్తులు ఈ ఉదయం నుంచి పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తుల కోలాకోలం భక్తి నినానాలతో మారుమోగింది. ముత్యాలమ్మ తల్లికి రంగురంగుల పుష్పాలు ప్రత్యేక ఆభరణాలతో అన్నయ్య మనోహరంగా అలంకరించారు. మహిళలు భక్తులు సాంప్రదాయ దుస్తులతో ధరించి నెత్తిన బోనాలతో మంగళ హారతులతో పాడుతూ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు చల్లని తల్లి మొక్కులతో భక్తిశ్రద్ధలతో ఆ తల్లికి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీ దిష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీ సభ్యులు క్యూ లైన్ తాగునీరు, ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను గట్టి బందోబస్తుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహేందర్ జన్ మృతి పార్టీకి తీరని లోటు


మహేందర్ జైన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

**గార్ల, పెన్ పవర్, సెప్టెంబర్ 6:** ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు గోదా మహేందర్ కుమార్ జైన్‌కు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఘన నివాళులర్పించారు. గార్లలోని మహేందర్ కుమార్ జైన్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహేందర్ కుమార్ జైన్ మృతి పార్టీకి, ఆయన కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గార్ల సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఇల్లందు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి, హతీరం నాయక్ చిన్న బంజర సర్పంచ్ బానోత్ మోతిలాల్, మర్రిగూడెం సర్పంచ్ భూక్యా రాంసింగ్, లెనిన్, షేక్ యాకూబ్ పాషా, రవి, ఆనంద్ జైన్, భూక్యా బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

## గట్టుమీది తండాలో ఘనంగా మేరమ్మ తల్లి, సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ పూజలు



**హైదరాబాద్, పెన్ పవర్ సెప్టెంబర్ 06:** నల్గొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం లోనీ గట్టుమీది తండాలో మేరమ్మ తల్లి దేవతతో పాటు సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ పూజారి రామావత్ మంగ్త నాయక్, గ్రామ సర్పంచ్ రామావత్ సోని శంకర్ నాయక్, గ్రామ పెద్దలు సిల్మా నాయక్, మంగ్త నాయక్, ధన్సింగ్ నాయక్, బిచ్య నాయక్, భద్రి నాయక్ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## బాచుపల్లిలో కారుకు నిప్పంటించిన రియల్టర్ అరెస్ట్

**హైదరాబాద్, పెన్ పవర్** ఇటీవల బాచుపల్లిలో వ్యాపార లావాదేవీల కారణంగా కారుకు నిప్పంటించిన కేసు కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు ఆదివారం ( సెప్టెంబర్ 6 ) నిందితుడిని అరెస్ట్ చేశారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన బాచుపల్లి పోలీసులు, ఎస్ఓటీ బృందాలు చందానగర్ కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అశోక్ రెడ్డిని అరెస్ట్ చేశారు.
సెప్టెంబర్ 3న జీపీఆర్ వెంచర్ లో పార్క్ చేసిన ఫార్చ్యూనర్ కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు అశోక్ రెడ్డి. రియల్ ఎస్టేట్ ప్లాట్ల కొనుగోలు, అమ్మకాల వివాదంలో బాధితుడిని భయపెట్టడానికే అశోక్ రెడ్డి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని రిమాండ్ కు తరలించి, నేరానికి ఉపయోగించిన బీవైడీ కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు పోలీసులు. ఇందులో ఎలాంటి రాజకీయ కోణం లేదని స్పష్టం చేశారు.

# కొండా : బీజేపీ చెత్త కుండి కాదు !



**హైదరాబాద్ పెన్ పవర్:** 'బీజేపీ పార్టీ చెత్త కుండి కాదు. ఎవరు పడితే వారిని పార్టీలో చేర్చుకోబోము. కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత సంక్షోభాన్ని దారిమళ్లించే వ్యవహారంగా చేస్తున్న ప్రయత్నం. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు నిజమైన ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ. అంతే కాని ఇది అసంతృప్త నేతలకు గమ్యస్థానం కాదు' అని బీజేపీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ ఇంఛార్జ్ పి.మురళీధర్ రావు ఎక్స్ వేదికగా వెల్లడించిన అభిప్రాయం ఇప్పుడు కలకలం రేపుతున్నది.మాజీ మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత సీఎం రేవంత్ రెడ్డి మీద చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆ పార్టీలో కొద్దిరోజుల పాటు ఆమె మీద చర్యలు తీసుకునే విషయంలో అంతర్గతంగా చర్చ జరిగిన నేపథ్యంలో ఆమె బీజేపీలోకి వస్తారని ప్రచారం జరిగింది. ఈ పరిస్థితులలోనే ఆమెను పలువురు బీజేపీ నేతలు పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆమెను పదవి నుండి తొలగించిన నేపథ్యంలో మురలీధర్ రావు ఈ పోస్ట్ చేయడం బీజేపీలో ఏం జరుగుతుంది ? కొండా సురేఖ విషయంలో ఆ పార్టీ వైఖరి ఏమిటి అన్న చర్చ మొదలయింది.

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ 'కొండా సురేఖ బీజేపీ పార్టీలో చేరుతాం అంటే స్వాగతిస్తాం. ఆమె మీద ఎలాంటి అవినీతి ఆరోపణలు లేని నేపథ్యంలో ఆమెను చేర్చుకునేందుకు పార్టీలో ఎలాంటి అభ్యంతరాలు ఉండవని' అభిప్రాయపడ్డారు. అరవింద్ ఆహ్వానం నేపథ్యంలోనే మురళీధర్ రావు పోస్ట్ పెట్టారా ? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అదే సమయంలో బీజేపీ ఎంపీ డీకె అరుణ మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేధాల మూలంగా కొండా సురేఖను మంత్రి పదవిని తప్పించడం బాధాకరమని, అయితే ఆమెను బీజేపీలోకి ఆహ్వానించే విషయంలో పార్టీలో ఎలాంటి చర్చలు జరగలేదని' అన్నారు. వైఎస్ హయాంలో డీకె అరుణ, కొండా సురేఖలు ఇద్దరూ మంత్రులుగా పనిచేయడం గమనార్హం.బీజేపీలో అగ్రెసివ్ గా మాట్లాడే ఎంపీలలో ధర్మపురి అరవింద్ ఒకరు. వరసగా రెండు సార్లు నిజామాబాద్ నుండి గెలిచారు. ఇటీవలి కాలంలో ఆయన సీఎం రేవంత్ రెడ్డి మీద నేరుగా విమర్శలు గుప్పిస్తూ వస్తున్నారు. ఇక కొండా సురేఖ పద్మశాలి సామాజిక వర్గం కాగా, కొండా మురళి మున్నూరు కాపు. ధర్మపురి అరవింద్ కూడా మున్నూరు కాపు. అందుకే ఆయన ఒక అడుగు ముందుకు వేసి కొండాను ఆహ్వానించాడని భావిస్తున్నారు. అయితే ఉత్తర తెలంగాణకే చెందిన బీజేపీ నేత మురళీధర్ రావు కొండా సురేఖ చేరిక అంశంపై ఘాటుగా పోస్ట్ పెట్టడం విశేషం.

# పాపం రాజగోపాల్.. కొండా దెబ్బకు యూటర్న్!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్‌లో ఫైర్ బ్రాండ్ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచుగా మీడియాలో ఉంటున్నారు. తనకు మంత్రి పదవి దక్కలేదని ఆక్రోశిస్తున్న ఆయన.. దానిని ఎలాగైనా సాధించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. అయితే.. ఈ క్రమంలో ఆయన సామ, దాన, బేధ, దండోపాయాల్లో కుదిరిన సమయం లో కుదిన దానిని వినియోగిస్తున్నారు. నిన్న మొన్నటి వరకు బేధోపాయాన్ని(వైరం) అనుసరించారు. సీఎం రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డారు.లేస్తే నేను మంచోడిని కాదు.. అన్నటైపులో వ్యాఖ్యలు గుప్పించారు. మునుగోడులో సొంత అధికారం చలాయిస్తున్నారు. బెల్టు షాపులు నిర్వహించేది లేదన్నారు బాగానే ఉంది. కానీ.. ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు తెచ్చుకున్న మద్యం దుకాణాలపైనా ఆయన ఆంక్షలు పెట్టారు. అధికారులపై చిందులు తొక్కారు. కానీ, తాజాగా ఇప్పుడు రూటు మార్చేశారు. తాజా మాజీ మంత్రి కొండా సురేఖపై పార్టీ వ్యవహరించిన తీరుతో కంగుతిన్న రాజగోపాల్ రెడ్డి ఏకంగా సామ మార్గం(బుజ్జగించడం)పట్టారు.. అబ్బే నేను సీఎం ను ఏమీ అనలేదని.. అదంతా తనంటే గిట్టని ఓ మీడియా చేసిందని చెప్పుకొచ్చారు.అంతేకాదు.. సీఎం రేవంత్‌తో తనకు ఎప్పుడూ ఎలాంటి పేచీ పంచాయితీలు లేవని కూడా రాజగోపాల్ వ్యాఖ్యానించారు. అంతే కాదు.. రేవంత్ రెడ్డి వంటి బలమైన నాయకుడి కారణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిందని.. మళ్లీ మళ్లీ కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. ఇక్కడితో కూడా ఆగకుండా.. మునుగోడు నియోజకవర్గానికి 2 వేల కోట్ల రూపాయల నిధులు కూడా కేటాయించారని.. తద్వారా అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయన్నారు. కానీ, రెండు మాసాల కిందట తన నియోజకవర్గం పాకిస్థాన్‌లో ఏమైనా ఉందా? అని ఇదే రాజగోపాల్ ప్రశ్నించడం గమనార్హం.ఇక, ఇప్పుడు మరో మాట కూడా చెప్పుకొచ్చారు. త్వరలో జరగబోయే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభకు తన నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలతో తరలివెళతానని రాజగోపాల్ చెప్పడం గమనార్హం. మొత్తంగా కొండా సురేఖ వ్యవహారం తేలిపోయిన దరమిలా.. నిన్న మొన్నటి వరకు ఎగిరి పడిన చాలా మంది నాయకులు లైన్‌లోకి వచ్చేస్తున్నారు. కొందరు ఇంటి నుంచి బయటకు కూడా రాకపోగా.. మరికొందరు మీడియాకు ముఖం చాటేస్తున్నారు. ఈ జాబితాలో ఇప్పుడు కోమటిరెడ్డి చేరిపోయారు. మరి ముమ్ముందు.. ఈ శాంతి వచనాలు ఇలానే కొనసాగుతాయో లేదో చూడాలి.


# ఇద్దరు పిల్లలతో కలిసి దంపతుల అదృశ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** నాగర్‌కర్నూలు జిల్లాలో పిల్లలతో కలిసి దంపతులు అదృశ్యమయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామానికి చెందిన పి.ప్రభాకర్.. తన భార్య తేజ, ఇద్దరు పిల్లలతో కలిసి అచ్చంపేటలో నివాసముంటున్నారు. గతంలో ప్రభాకర్ ఆటోమొబైల్ దుకాణం నిర్వహించాడు. కొన్నాళ్ల క్రితం అది మూతపడింది. మూడు రోజులుగా ఇంటి వద్ద ప్రభాకర్, ఆయన భార్య, పిల్లలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశారు. ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పుల బాధతో కుటుంబం మొత్తం అదృశ్యమైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



# చేతులు కాలాక ... ఏడిస్తే ఏమొస్తుంది ?!





**హైదరాబాద్ పెన్ పవర్:** 'చేతులు కాలాక .. ఆకులు పట్టుకోవడం' అంటే ఇదేనేమో. సీఎం రేవంత్ రెడ్డి మీద మాజీ మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత గతంలో ఒకసారి, ఇటీవల తాజాగా కయ్యానికి కాలు దువ్విన విషయం తెలిసిందే. పరకాల సీటుకు ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించడానికి రేవంత్ రెడ్డి ఎవరని, అది కొండా ఫ్యామిలీ సామ్రాజ్యం అని, చేతనయితే రేవంత్ రెడ్డి, వాళ్ల నాన్న, తాత ఎవరు వస్తారో నా మీద నిలబడి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరిన విషయం తెలిసిందే . తాను చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తే తన ప్రతిస్పందన మరోవిధంగా ఉంటుందని కూడా హెచ్చరించింది.కాంగ్రెస్ పార్టీలో వ్యాఖ్యలు కలకలం రేపడం, కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం, ఆమె సమాధానం ఇవ్వడం, దానికి క్రమశిక్షణ సంఘం సంతృప్తి చెందక పోవడం, ఆమెను మంత్రి పదవి నుండి తొలగించాలని అధిష్టానానికి సిఫారసు చేయడం, ఆమె ఢిల్లీకి వెళ్లి వివరణ ఇవ్వడం, చివరకు ఆమెను పదవి నుండి తొలగించడానికే మొగ్గు చూపిన అధిష్టానం ఆమెను బర్తరఫ్ చేయడం జరిగిపోయింది.అయితే తన తల్లి కొండా సురేఖను మంత్రి పదవి నుండి తొలగించిన విషయంలో కొండా సుష్మిత తీవ్ర మనోవేదనకు గురవుతున్నట్లు తెలుస్తుంది. పదవి నుండి తొలగించిన రోజు వివిధ ఛానళ్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో తీవ్ర ఆరోపణలు చేసిన సుష్మిత ఇప్పుడు తన తల్లిని తొలగించడంపై ఛానళ్ల ముందు ఏడుస్తుండడం చర్చానీయాంశంగా మారింది.'నేను చేసిన వ్యాఖ్యల మీద తన తల్లి మీద చర్యలు తీసుకుంటారని అనుకుంటే తాను అసలు మాట్లాడక పోయే దానినని, ఎంపీపీ స్థాయి నుండి ఎంతో కష్టపడి రెండు సార్లు మంత్రి అయిన తన తల్లిని ఇలా అవమానిస్తారని ఊహించలేదని, మా అమ్మను బలిచేయడం ఎంత వరకు కరెక్ట్. రేవంత్ రెడ్డి నామీద కోపాన్ని నా తల్లి మీద చూయించాడని' బోరున విలపించింది. నా వల్లే నా తల్లికి అవమానం జరిగిందని వ్యాఖ్యానించింది.

తీవ్రమైన వ్యాఖ్యలు చేసి ఇప్పుడు సుష్మిత విలపించడాన్ని తల్లి పదవి పోయిన నేపథ్యంలో కలిగిన బావోద్వేగం అని అంటున్నారు. ఇలా జరుగుతుందని అనుకోలేదు. అలా మాట్లాడేదాన్ని కాదు అని సుష్మిత అంటున్నా ఇది ఆ కుటుంబానికి తగిలిన రాజకీయ దెబ్బ అని, సుష్మిత ఇంతకు ముందు ఓఎస్డీ సుమంత్ వివాదంలోనూ ఇలాగే రచ్చ చేసిందని, తాజా పరిణామాలు ఆమె తల్లి పదవిని కాపాడలేకపోయాయని అంటున్నారు.

# కేటీఆర్, హరీష్ లను సీఎం రేవంత్ ఓడించగలడా?

**హైదరాబాద్ పెన్ పవర్:** పగటిపూట నియోజకవర్గాల పర్యటనలు, రాత్రిపూట విపక్ష నేతల గుండెల్లో రైళ్లు.. సిరిసిల్ల, సిద్ధిపేట కంచుకోటల 'ఫ్యాబ్రికేషన్' ఊడదీసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సరికొత్త పొలిటికల్ డిజైన్ ప్రారంభించారు. అధికార పీఠం ఎక్కిన క్షణం నుంచి 'ఎవరి పాయింట్ ఎక్కడ ఉందో' సరిగ్గా నోట్ చేసుకుంటున్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు నేరుగా బీఆర్ఎస్ హోమ్ గ్రౌండ్స్‌కే కబురు పంపారు. నిన్నటివరకు తమ కంచుకోటల బురుజుల పైనుంచి కాంగ్రెస్‌పై విమర్శల తోటాలు పేల్చిన కేటీఆర్, హరీశ్‌రావులకు.. ఇప్పుడు సొంత గుమ్మం ముందే భారీ బహిరంగ సభల రూపంలో వెల్‌కమ్ బోర్డులు పడుతున్నాయి. కేసీఆర్ పొలం బాట పట్టి 'రెస్ట్ మోడ్'లోకి వెళ్లడంతో.. పార్టీని మోస్తున్న అల్లుడు, అబ్బాయిలపైనే సీఎం గారు ప్రత్యేక ప్రేమాభిమానాలు కురిపిస్తున్నట్లు కనిపిస్తోంది. "సిరిసిల్లలో సభ పెడతాం.. సిద్ధిపేటలో జెండా పాతేస్తాం" అంటూ సీఎం ఇస్తున్న వార్నింగ్‌లు చూస్తుంటే.. బీఆర్ఎస్ నేతలకు గ్రేటర్ ఎన్నికల కన్నా, సొంత నియోజకవర్గాల్లో పట్టు నిలుపుకోవడమే పెద్ద 'టాస్క్'లా మారేలా ఉంది. గులాబీ బాస్‌ల కోటల్లో కాంగ్రెస్ శ్రేణుల హడావుడి చూస్తుంటే.. 'మా ఇంట్లో సభలేంటి సామీ' అని విపక్ష నేతలు లోలోపల లబోదిబోమంటుండగా.. ఈ 'కంచుకోటల కరిగింపు' రాజకీయ నాటకంలో నెక్స్ట్ సీన్ ఎలా ఉండబోతుందోనని తెలంగాణ ప్రజానీకం పాప్‌కార్న్ పట్టుకుని ఆసక్తిగా ఎదురుచూస్తోంది.తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ మధ్య శత్రుత్వం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న దూకుడు వ్యూహాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. బీఆర్ఎస్ అగ్రనేతలను వారి సొంత నియోజకవర్గాల్లోనే దెబ్బతీయాలనే



సంకల్పంతో కాంగ్రెస్ అధిష్టానం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల.. మాజీ మంత్రి హరీశ్‌రావు కంచుకోట అయిన సిద్ధిపేటలపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు.

గత దశాబ్ద కాలంగా సిరిసిల్ల, సిద్ధిపేటలు బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేని రాజకీయ దుర్గాలుగా నిలిచాయి. అక్కడ కేటీఆర్, హరీశ్‌రావులకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్, బలమైన కేడర్ ఆ పార్టీకి ప్రధాన బలంగా మారాయి. అయితే నేరుగా ఆయా నియోజకవర్గాల్లోనే భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు రేవంత్ రెడ్డి ప్రకటించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. త్వరలోనే సిరిసిల్లలో కాంగ్రెస్ తరఫున భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయాలని సీఎం పిలుపునిచ్చారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానంలో సభ పెట్టడం ద్వారా స్థానిక కాంగ్రెస్ కేడర్‌లో ధైర్యాన్ని నింపడంతో పాటు.. బీఆర్ఎస్ ఓటు బ్యాంకును సవాల్ చేయడమే కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోంది.

దీనికి కొనసాగింపుగా వచ్చే నెలలో సిద్ధిపేటలో మరొక భారీ సభకు ప్లాన్ చేస్తున్నారు. హరీశ్‌రావు రాజకీయ ప్రస్థానానికి మూలస్తంభమైన సిద్ధిపేటలో కాంగ్రెస్ బలాన్ని నిరూపించుకోవాలనేది రేవంత్ రెడ్డి వ్యూహంలో ప్రధాన భాగం. కేసీఆర్ రాజకీయంగా కొంత సమయం వెనకడుగు వేసిన ఈ సమయంలో కేటీఆర్, హరీశ్‌రావులే బీఆర్ఎస్ పార్టీకి దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ ఇద్దరు కీలక నేతల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలాన్ని ప్రదర్శించడం ద్వారా బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడుతుందని

కాంగ్రెస్ వ్యూహకర్తలు భావిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సభల వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్ పునాదులను దెబ్బతీయాలని రేవంత్ రెడ్డి ప్రణాళికలు రచిస్తున్నారు.కాంగ్రెస్ విసురుతున్న ఈ సవాల్‌ను బీఆర్ఎస్ నేతలు ఎలా స్వీకరిస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సొంత నియోజకవర్గాల్లో పట్టు సడలకుండా చూసుకోవడంతో పాటు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రతివ్యూహాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు కూడా సిద్ధమవుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలతో సిరిసిల్ల, సిద్ధిపేట నియోజకవర్గాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో జరగబోయే ఈ బహిరంగ సభలు తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ పోరును మరింత వేడెక్కించడం ఖాయంగా కనిపిస్తోంది.

# మేయర్ రేసులో వాసుపల్లి....జగన్ వ్యూహం ?

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ మేయర్ సీటు మీద వైసీపీ కూడా ఫుల్ ఫోకస్ పెట్టేసింది. 2021లో గెలిచిన ఆ పార్టీ జనరల్ సీటులో బీసీ మేయర్ ని మహిళను అనూహ్యంగా తెచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పార్టీ బీసీలకు పెద్ద పీట వేస్తుందని అలా చెప్పుకుంది. ఇపుడు మరోసారి బీసీల వైపే వైసీపీ చూపు ఉందని అంటున్నారు. అదే విధంగా స్థానిక అభ్యర్థికి ఛాన్స్ ఇవ్వడం ద్వారా దానిని కూడా ఎన్నికల అస్త్రంగా మార్చుకోవాలని చూస్తోంది. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే విశాఖ దక్షిణ నియోజక వర్గానికి చెందిన వాసుపల్లి గణేష్ కుమార్ పేరు అయితే వైసీపీలో చురుకుగా పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. ఆయన 20014, 2019లలో రెండు సార్లు దక్షిణం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. టీడీపీ విశాఖ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. నగర రాజకీయాల మీద ఆయనకు పట్టు ఉంది అని అంటారు.



**ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతో :**

విశాఖలో వైసీపీకి ఉన్న బలమైన నేతగా వాసుపల్లి పేరు వినిపిస్తుంది. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆందోళనలు చేయడమే కాదు సొంతంగా నియోజకవర్గం సమస్యల మీద ఆయన గట్టిగా పోరాడుతారు. ప్రజలతో అను నిత్యం సంబంధాలను కొనసాగిస్తూ ఉంటారు. దాంతో పాటు అంగబలం అర్ధబలం కూడా ఉండడంతో ఆయన పేరుని సీరియస్ గానే పరిశీలిస్తున్నారు అని అంటున్నారు. నిజానికి మరో మాజీ ఎమ్మెల్యే కూడా మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి చూస్తున్నారు అని ప్రచారంలో ఉంది. ఆయన వెలమ సామాజిక వర్గానికి చెందిన బీసీ నేత తైనాల విజయకుమార్. ఆయన కార్పోరేటర్ గా ఉంటూ అనూహ్యంగా 2009లో విశాఖ ఉత్తరం నుంచి ఎమ్మెల్యే అయిపోయారు. ఇపుడు ఆయన చూపు మళ్ళీ కార్పోరేషన్ రాజకీయాల మీద పడింది అని అంటున్నారు. జీవీఎంసీలో పట్టు ఉందని సొంత సామాజిక వర్గం సహకారం ఉందని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మద్దతు కూడా ఆయనకు ఉందని చెప్పుకుంటున్నారు.

**ఫైర్ బ్రాండ్ లీడర్ గా :**

అయితే ఈ ఇద్దరిలో అధినాయకత్వం మొగ్గు వాసుపల్లి వైపే ఎక్కువగా ఉందని అంటున్నారు. ఆయన దక్షిణ నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి గా ఉన్నారు. ఫైర్ బ్రాండ్ లీడర్ అని చెబుతారు. కూటమి మీద ధీటుగా విమర్శలు చేస్తారు అని పేరు. దాంతో పాటు ఆయన కూడా పోటీ చేస్తాను అని ఇప్పటికే ప్రకటించేసారు. తమ నాయకుడు జగన్ కనుక పోటీకి సిద్ధం కావాలని కోరితే తాను మేయర్ గా బరిలో ఉంటాను అని అన్నారు. విశాఖ అభివృద్ధికి సంబంధించి తనకు అజెండా ఉందని కూడా వాసుపల్లి అంటున్నారు.

**పక్కా ప్లాన్ తోనే :**

వాసుపల్లిని బరిలోకి దించాలన్నది వైసీపీ పక్కా ప్లాన్ తోనే చేస్తోంది అని అంటున్నారు. కూటమి నుంచి ఓసీకి ఇస్తే నాన్ లోకల్ కి ఇస్తే అది వైసీపీకి ప్లస్ అవుతుందని అదే జనంలో పెట్టి ప్రచారం చేయవచ్చు అన్నది కూడా వ్యూహంగా ఉంది అంటున్నారు. కూటమిలో టీడీపీ పోటీ చేస్తుందని అంటున్నారు. ఓసీల నుంచే ఎక్కువ పోటీ ఉంది. దాంతో పాటు విశాఖలో స్థిరపడిన వారు కూడా పోటీకి ఉత్సాహం చూపిస్తున్నారు. దాంతో వారికే కనుక టికెట్ ఇస్తే వైసీపీ వలస నేతలు అని ప్రచారం చేయడానికి రెడీగా ఉంది అని అంటున్నారు. అందుకే వైసీపీ తన చేతిలో బీసీ కార్డుతో పాటు లోకల్ కార్డు కూడా ఉంచుకుందని చెబుతున్నారు. మేయర్ ఎన్నికలు అంటే డబ్బుతో ఖర్చు కాబట్టి వాసుపల్లి ఉత్సాహంగా ఉన్నారు కాబట్టి ఆయనకే వైసీపీ టికెట్ ఇచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని అంటున్నారు.

# జగన్ స్థానిక ప్రచారం ?

**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా 2024 ఎన్నికల కంటే పెరిగిన తమ బలాన్ని చాటాలని అనుకుంటోంది. అంతే కాదు కూటమి రెండేళ్లకు పైగా సాగిన పాలనలో ప్రజా వ్యతిరేకత గణనీయంగా ఉందని వైసీపీ నమ్ముతోంది. దాంతో తమ పార్టీకి అనూహ్యమైన ఫలితాలు వస్తాయని కూడా ధీమా వ్యక్తం చేస్తోంది. అందుకే జగన్ కూడా మొత్తం 175 అసెంబ్లీ ఇంచార్జిలకు గట్టిగానే చెబుతున్నారు. ఎక్కడా ఏకగ్రీవాలు వద్దు అని కూడా స్పష్టం చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా ఉందని కూడా వారికి తెలియజేస్తూ సరైన వ్యూహాలతో అంతా కలిసి సమిష్టిగా పోరాడితే వైసీపీకి మంచి ఫలితాలు వస్తాయని కూడా అంటున్నారు.



**సీట్ల సర్దుబాటు మీదనే :**

కూటమిలో మూడు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అనుకున్నంత ఈజీ కాదని వైసీపీ భావిస్తోంది. అంతే కాకుండా లోకల్ బాడీ ఎన్నికలు కాబట్టి దిగువ స్థాయిలో నాయకులు తమకు బలం ఉందనుకుంటే పార్టీని పక్కన పెట్టి మరీ రెబెల్స్ గా పోటీ చేయవచ్చు అని అంటున్నారు. అలా కూటమిలో పార్టీలకు పనిచేయాలని పై స్థాయిలో ఎంత చెప్పినా దిగువకు వచ్చేసరికి అది అనుకున్నంతగా వర్కౌట్ కాకపోవచ్చు అని అంటున్నారు. మిత్రులకు ఎక్కువ సీట్లు ఇస్తే ఓట్ల బదిలీ జరగకపోగా రెబెల్స్ పెరుగుతారని అలాగని తక్కువ సీట్లే కూటమి ఐక్యంగా పోటీకి అవరోధంగా మారుతుందని కూడా వైసీపీలో చర్చ సాగుతోంది. ఏ విధంగా చూసినా 2024లో జరిగినంత కట్టుగా ఈసారి మూడు పార్టీల మధ్య ఓట్ల బదిలీ కానీ పోటీ కానీ జరిగే వీలు లేదన్నది వైసీపీ అంచనాగా ఉంది. దాంతో తమకు ఇక్కడే అడ్వాంటేజ్ ఉంటుందని కూడా లెక్క వేసుకుంటోంది.

**జగన్ దిగితేనే :**

అయితే వైసీపీకి ఎన్ని అంచనాలు ఉన్నా ఎంతలా క్యాడర్ ని లీడర్ ని యాక్టివ్ చేసి రంగంలోకి దించినా జగన్ కూడా కీలక సమయంలో జనంలోకి రాకపోతే పార్టీకి అది ఇబ్బందిగా మారుతుందని అంటున్నారు. ఎందుకంటే మేయర్ జెడ్పీలు అన్నవి కీలకంగా ఉంటాయి. జిల్లా నగరాలలో ముఖ్య కేంద్రాల రాజకీయాలను ఇవి ప్రభావితం చేస్తాయి. కాబట్టి ఇక్కడ ఎంతో కొంత సానుకూలత వైసీపీకి రావాలీ అంటే జగన్ ముఖ్యమైన చోట్ల అయినా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే బాగుంటుంది అన్న భావన అయితే పార్టీలో ఉంది. జగన్ మొత్తానికి మొత్తం తిరగకపోయినా కీలక జిల్లాలలో ముఖ్యమైన రీజియన్లలో సభలు పెడితే కనుక వైసీపీ విజయావకాశాలను విశేషంగా ప్రభావం చేస్తుందని విశ్లేషిస్తున్నారు.

**నిజంగా వస్తారా :**

అయితే జగన్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి నిజంగా వస్తారా అన్నది అయితే తెలియదనే అంటున్నారు. జగన్ 2021 ఎన్నికల్లో కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో ప్రచారం చేయలేదు, అయితే అప్పట్లో పార్టీ అధికారంలో ఉంది అన్ని బలాలూ అనుకూలించాయని అంటున్నారు. ఇపుడు అలా కాదని వైసీపీకి ఈ ఎన్నికలు ఎంతో ముఖ్యమైనవి అని కూడా చెబుతున్నారు. అందువల్ల జగన్ వస్తేనే బాగుంటుంది అన్నది పార్టీలో నేతల మాటగా ఉంది అని ప్రచారం సాగుతోంది. రెండేళ్ళకు పైగా సాగిన కూటమి పాలన మీద జగన్ చేసే విమర్శలు ఆయన ప్రసంగాలు అయితే జనంలోకి బాగా వెళ్తాయని అంటున్నారు. అలా వైసీపీకి అనుకూలత ఏర్పడుతుందని భావిస్తున్నారు. మరి జగన్ ప్రచారానికి వస్తారా రారా అన్నది అపుడే తేలుతుందని అంటున్నారు.

# కూటమిలో పవన్ కృష్ణ సారథ్యం.. అక్కడ కీ రోల్...!

జనసేన పార్టీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను ఉమ్మడిగా ముందుకు తీసుకురావడంలోను, భారీ విజయం దక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలోనూ కీలక పాత్ర పోషించిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అత్యంత కీలక పాత్ర పోషించనున్నారన్నది కూటమిలో జరుగుతున్న చర్చ. గత అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన 100% విజయభేరి ఇచ్చిన ఉత్సాహంతో, కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నారు.


ఈ నేపథ్యంలో జనసేన పార్టీ స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. స్థానిక సమరంలో పవన్ కళ్యాణ్ కీలకం కావడానికి ప్రధాన కారణాలు చాలానే ఉన్నాయి. స్థానిక ఎన్నికలకు ఆయువు పట్టు వంటి.. గ్రామీణ అభివృద్ధి - పంచాయతీ రాజ్ పోర్ట్‌ఫోలియోపై ఆయన ప్రధానంగా దృష్టి పెట్టారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్నారు. ఉపాధి హామీ నిధుల విడుదల, గ్రామాల్లో పనుల నిర్వహణ, ఇటీవల నిర్వహించిన చారిత్రాత్మక గ్రామ సభలు ఆయనకు గ్రామీణ ఓటర్లలో, ముఖ్యంగా తటస్థులలో భారీ క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి.కూటమి సమన్వయం విషయానికి వస్తే.. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమిగా ఈ ఎన్నికల్లోనూ కలిసి పోటీ చేసే అవకాశం ఉంది. సీట్ల సర్దుబాటు, క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయం కుదర్చడంలో పవన్ కళ్యాణ్ నిర్ణయాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మహిళలు, యువత మద్దతును కూడ గట్టడంలోనూ కీలక రోల్ పోషిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి పెట్టడం, పవన్ కళ్యాణ్ క్లీన్ పాలిటిక్స్ ఇమేజ్ మహిళా, యువ ఓటర్లను జనసేన వైపు ఆకర్షిస్తున్నాయి.కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో, క్షేత్రస్థాయిలో పట్టు నిలుపుకోవడానికి పవన్ కళ్యాణ్ వ్యూహాలు ఇటు జనసేన పార్టీకి అటు కూటమికి దిక్సూచిలా మారనున్నాయి. మొత్తంగా గత సార్వత్రిక ఎన్నికల సమయంలో అనుకూలంగా మారిన ఆయన వ్యూహాలు ఇప్పుడు కూడా సానుకూలంగానే మారనున్నాయని అంటున్నారు. ఈ పరిణామం కూటమికి మరింత బలం చేకూరుస్తుందని అంటున్నారు.

# పవన్ రెడీ అంటే.. దూకుడే!



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన అధినేత పవన్‌కల్యాణ్ -రెడీ- అంటే చాలు.. రంగంలోకి దిగేందుకు భారీ సంఖ్యలో నాయకులు కాచుకుని కూర్చున్నారు. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకు..నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లాల వరకు అన్ని కమిటీలను ఇటీవల పార్టీ అధినేత రద్దు చేసిన విషయం తెలిసిందే. వీటిలో కీలక నాయకులు, మేధావులు, పార్టీ అధికార ప్రతినిధులు కూడా ఉన్నారు. అయితే.. కొత్తగా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారే కానీ.. ఇప్పటి వరకు ఆ దిశగా పార్టీ చర్యలు తీసుకోలేదు.దీంతో పదవుల కోసం ఎదురు చూస్తున్నజనసేన నాయకులు.. పవన్ కల్యాణ్ నిర్ణయం కోసం వేచి చూస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు రానున్నాయి. ఈ నేపథ్యంలో కమిటీల ఏర్పాటు పార్టీకి, ముఖ్యంగా పవన్‌కల్యాణ్ రాజకీయ వ్యూహాలకు కూడా అత్యంత అవసరంగా మారింది. అయితే.. గతంలో తాను ఏర్పాటు చేసిన కమిటీల్లోని నాయకులు దారి తప్పుతున్నారని.. పార్టీపరంగానేకాకుండా.. కీలకమైన కూటమికే ఇబ్బందులు తెచ్చేలా వ్యవహరిస్తున్నారని భావించిన పవన్ .. వాటిని ఒక్క నిర్ణయంతో రద్దు చేశారు.కానీ, ఎక్కువ కాలం వేచి చూసేందుకు.. కమిటీలు లేకుండా పార్టీని నిలబెట్టేందుకు అవకాశం తక్కువగానే ఉంది. స్థానికంగా జరిగే ఎన్నికల్లో నాయకుల ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అలాంటి నాయకులు ఇప్పుడు కమిటీలను రద్దు చేయడంతో సుప్తచేతనావస్థలో ఉన్నారన్నది పార్టీకిఅందుతున్న నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామ, పట్టణస్థాయి కమిటీల్లో చైతన్యం నింపాల్సిన అవసరం ఉందన్నది వాస్తవం. ఇవి స్థానికెన్నికలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.వీటిని ఏర్పాటు చేయడం ద్వారా.. పార్టీపరంగా పుంజుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే.. పార్టీ సిద్ధాంతాల కు..కమిటీ నాయకులకు ముడిపెడుతున్న పవన్.. ఈ విషయంలో తగ్గేదేలేదని స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా కూటమిగా ముందుకు సాగాలన్నదే పవన్ లక్ష్యంగా ఉంది. ఈ దిశగానే కమిటీలను ఏర్పాటు చేయాలని తలపోస్తు న్నారు. కానీ, ఎప్పటికి ఏర్పాటు చేస్తారు? అనేదిప్రశ్న. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 300 మందికిపైగా నాయకులు, క్షేత్రస్థాయి కేడర్ఈ కమిటీల ఏర్పాటు కోసం నిరీక్షిస్తున్నారు. పవన్ సై అంటే.. సై సై అంటూ.. రంగంలోకి దిగాలని భావిస్తున్నారు. మరి పవన్ కల్యాణ్ ఎప్పుడు నిర్ణయిస్తారు? అనేది చూడాలి.

# అడగడానికి ఏం లేదు.. చంద్రబాబు చేసేశారు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇదేదో సినిమా డైలాగు కాదు. నిజమే!. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సుదీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న పలు కీలక సమస్యలకు సీఎం చంద్రబాబు పరిష్కారం చూపించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ పే-రివిజన్ కమిషన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏల విడుదలకు అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల ను సీఎం వారికి వివరించారు. రాష్ట్ర ఆదాయ-వ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 1-7-2024, 1-1-2025లకు చెందిన రెండు డీఏల విడుదలకు ఆమోదం తెలిపారు.

**సంక్రాంతి పండగే!**

ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. ఇక 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయడానికి అంగీకరించారు. ఇక పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇక గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. దీనిలో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింప చేయనున్నారు. ఇక ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏటా రూ.2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది. అయినప్పటికీ.. చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఆయన చెప్పడానికి ఏమీ లేకుండా.. ఉద్యోగులు అడగానికి కూడా లేకుండా చేసేసినట్టు అయింది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## మట్టి తిని.. బురద తాగి.. బతికిపోయారు:
# భూమ్మీద నూకలంటే ఇదే!!



"ఆడికి భూమ్మీద ఇంకా నూకలున్నాయిరా!" అనే మాట తరచుగా వింటుంటాం. అయితే.. ఇది మాటవ రసకే అన్నా.. కొన్ని కొన్ని సందర్భాల్లో నిజం అవుతూనే ఉంది. 9 రోజుల కిందట నేపాల్‌లో సంభవించిన వరద ప్రళయంలో వెయ్యికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరిన్ని వందల మంది అడ్రస్ లేకుండా పోయారు. ప్రస్తుతం నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కేవలం శవాల కోసమే గాలింపు జరుగుతోంది. ఎందుకంటే.. 9 రోజుల తర్వాత.. ఎవరూ బతికి ఉండే అవకాశం లేదని.. నిద్రాహారాలు.. గుక్కెడు నీరు లేకుండా ప్రాణాలు నిలవవని వైద్యులు ధ్రువీకరించడమే.

కానీ, చిత్రంగా ఇద్దరు వ్యక్తులు ప్రాణాలతో బయట పడ్డారు. దాదాపు 9 రోజులుగా వారు నరకం అనుభవి స్తూనే ప్రాణాలతో సజీవంగా ఉండడం అందరినీ విస్మయానికి గురి చేసింది. ఆ వెంటనే వారిని ఆసుప త్రికి తరలించి ఆక్సిజన్‌తోపాటు ప్రాణాధార ఔషధాలను ఎక్కిస్తున్నారు. ఈ పరిణామమే.. భూమ్మీద నూకలు ఉండడం అంటే ఇదే.. అనే మాటను వినిపించేలా చేసింది.

**ఎలా బ్రతికారు?**

నేపాల్‌లో సంభవించిన ప్రళయ వరదల్లో.. కీలకమైన త్రిశూలి జల విద్యుత్ ప్రాజెక్టు వద్ద.. పనుల్లో నిమగ్నమైన 362 మంది కనిపించకుండా పోయారు. వారిలో కేవలం 31 మంది మాత్రమే బయటకు వచ్చారు. మిగిలిన వారి ఆచూకీ కోసం వెతుకులాట జరుగుతోంది. అయితే.. వారెవరూ ప్రాణాలతో ఉండే పరిస్థితి లేదని అధికారులు అంచనా వేశారు. కానీ, అనూహ్యంగా మెకానిల్ ఫోర్‌మ్యాన్ షా(30), త్రిశూలీ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ అమిర్ మహర్జన్(45)లు ప్రాణాలతో బయట పడ్డారు. అది కూడా.. 9 రోజుల తర్వాత.. పూర్తిగా బురద, రాళ్లతో కూరుకుపోయిన సొరంగంలో వారు ప్రాణాలతో ఉండడం అందరినీ విస్మయానికి గురి చేసింది. అదేసమయంలో వారి పట్ల దేవుడిని ప్రార్థించేలా కూడా చేసింది.

**మట్టి తిని..**

కూరుకుపోయిన బురద ఎండిపోక ముందే.. దాని నుంచి కొంత తలను బయట పెట్టి.. ఇద్దరూ శ్వాస పీల్చుకున్నట్టుగా అధికారులు చెబుతున్నారు. కానీ, వారి చేతులు.. కాళ్లు మాత్రం పూర్తిగా బుదరలో కూరుకుపోయాయన్నారు. ఇక, ఆకలికి తాళలేక మట్టినే తిన్నట్టు చెబుతున్నారు. బురద నీటినే తాగినట్టు తెలిపారు. అయితే.. మరో 12 గంటలు గడిచి ఉంటే.. వారి ప్రాణాలు కూడా దక్కేవి కావని అంటున్నారు. ఇదిలావుంటే.. ఇలా మట్టికింద కూరుకుపోయి.. ప్రాణాలతో అల్లాడుతున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలను మరింత ముమ్మరం చేశారు.

## వెరైటీ స్నాక్స్ : మునగతో టేస్టీ వంటకం..
## బజ్జీలు.. పకోడీల మాదిరిగా కరకరలాడతాయి




పిల్లలు బడినుంచి ఇంటికి రావడంతోనే అమ్మా తింటానికి కావాలని మారాం చేస్తుంటారు. అప్పుడు ఇంట్లో పకోడీలు.. శాండ్? విచ్? లు పెడతాం.. రోజు ఇవే పెడితే పిల్లలకు బోరు కొడుతుందని. అయితే కరకరలాడే వెరైటీ వంటకాలు పెడితే చాలా ఇష్టంగా లాగిస్తారు. మరి అలాంటి స్నాక్స్? ను మునగతో తయారు చేయొచ్చు.. రుచి అమోఘంగా ఉంటుంది. మరి మునగస్నాక్స్?ను ఎలా తయారు చేయాలో తెలుసుకుందామా మరి..!

సాయంత్రం అవ్వగానే వేడి వేడి టీతో పాటు కరకరలాడే స్నాక్ ఏదైనా తినాలనిపించడం సహజం. ఇంట్లో ఉన్న పదార్థాలతోనే రోజూ చేసుకునే పకోడీలు, బజ్జీలు, శాండ్ విచ్ లకు బదులుగా ఈసారి కాస్త కొత్తగా ట్రై చేయాలనుకుంటే..క్రిస్పీ మునగకాయ స్నాక్ మీకు బెస్ట్ ఛాయిస్.

సాధారణంగా మునగకాయ అనగానే మనకు సాంబార్ లేదా కూర మాత్రమే గుర్తొస్తాయి. కానీ, సరైన మసాలాలు దట్టించి ఇలా స్నాక్ లా చేస్తే దాని రుచి అమోఘంగా ఉంటుంది. మునగకాయ స్నాక్ తయారీకి కావలసిన పదార్థాలు

**మునగకాయలు - 2**
**శనగపప్పు - 50 గ్రాములు**
**పచ్చి బియ్యం - అర కప్పు**
**పచ్చిమిర్చి - 2**
**జీలకర్ర పొడి - 1 టీస్పూన్**
**ధనియాల పొడి - 1 టీస్పూన్**
**ఆమ్చూర్ పొడి - 1/2 టీస్పూన్**
**ఉప్పు - రుచికి సరిపడా**
**నూనె - వేయించడానికి సరిపడ**
**కొత్తిమీర - కొద్దిగా**

### మునగకాయ స్నాక్ తయారీ విధానం


మునగకాయలను శుభ్రంగా కడగాలి. రెండు అంగుళాల పొడవు ఉండేలా ముక్కలు ముక్కలుగా కట్? చేసుకోవాలి. ఆ తరువాత ఈ ముక్కలను ఒక కుక్కర్? లో వేసి ఒక మాదిరిగా ఉడకబెట్టాలి. మరీ మెత్తగా ఉండకూడదు. ఆ తరువాత నీటిని వడకొట్టి.. ముక్కలను పక్కన పెట్టుకోవాలి.

ఇప్పుడు శనగపప్పు.. బియ్యాన్ని 10 నిమిషాల పాటు నీటిలో నానబెట్టుకోవాలి. ఆ తరువాత మిక్సీ గిన్నెలో నానపెట్టిన శనగపప్పు.. బియ్యం.. జీలకర్ర పొడి,ఆమ్? చూర్ పొడి,ధనియాల పొడి,పచ్చిమిర్చి, ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. అయితే మరీ పల్చగా.. మరీ గట్టిగా ఉండకూడదు.

ఇప్పుడు స్టవ్‌పై కళాయి పెట్టాలి. అందులో నూనె పోసి వేడి చేయాలి. ఇప్పుడు ఉడకబెట్టిన మునగకాయ ముక్కలను రుబ్బిన పిండిలో బాగా ముంచాలి. ఈ పిండి ముక్కకు అన్ని వైపులా దట్టంగా పట్టేలా చూసుకొని కాగుతున్న నూనెలో వేయించాలి.

మీడియం ఫ్రేమ్ లో వేయిస్తూ ముక్కలను అటూ ఇటూ తిప్పుతూ లేత బంగారు రంగులోకి వచ్చేలా వేయించాలి. అంతే మునగకాయ స్నాక్ రెడీ. – ఇవి కరకరలాడతాయి. వీటిని టీతో కలిపి తింటే ఆహా ఏమి రుచిలే అంటూ లొట్టలేయాల్సిందే..మరి మునగ స్నాక్స్? ను ఓ సారి ట్రై చేద్దామా..!

# కూటమి రెండేళ్ల పాలన.. 4 ప్లస్సులు - 3 మైనస్సులు..!



ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండున్నరేళ్లు (2024 జూన్ నుండి) పూర్తయింది. ఈ నేపథ్యంలో కూటమి పాలనపై ప్రజాభిప్రాయం ఎలా ఉందన్నది ఆసక్తికరం. అంతేకాదు.. భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలకు వచ్చే ఎన్నికల నాటికి ఏవిధంగా ముందుకు సాగాలన్న వ్యూహాలు వేసుకునేందుకు కూడా ప్రజల అభిప్రాయం కీలకంగా మారింది. ఈ రకంగా చూస్తే.. ప్రస్తుతం ప్రజల్లో కూటమిపై మిశ్రమ అభిప్రాయం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.


క్షేత్రస్థాయి పరిశీలనలు, రాజకీయ విశ్లేషణలు, వివిధ సర్వేల ప్రకారం ప్రజాభిప్రాయం 4 ప్లస్సులుగా, 3 మైనస్సులుగా సాగుతోందని చెబుతున్నారు. అనుకూల అంశాల విషయానికి వస్తే.. రాజధాని అమరావ తి, పోలవరం పునరుద్ధరణ బాగానే పనిచేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రాజధాని అమరావతి పనులను వేగవంతం చేయడం, పోలవరం పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది.

అలానే, సంక్షేమ పథకాలు, పెన్షన్ల పెంపు కూడా ప్రభుత్వానికి సానుకూలత తీసుకువచ్చాయి. సామాజిక పెన్షన్లను పెంచడం, వాటిని లబ్ధిదారులకు సకాలంలో అందజేయడం ప్రజల్లో మంచి నమ్మకాన్ని కలిగించింది. అదేసమయంలో గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలపై కూడా కొంత మేరకు సానుకూలంగానే వాతావరణం కనిపిస్తోంది. 'తల్లికి వందనం', 'దీపం 2.0– వంటి పథకాలను దశలవారీగా ప్రారంభించడం మహిళా ఓటర్లలో సానుకూల ప్రభావం చూపుతోంది.

అదేవిధంగా పెట్టుబడులు, ఉద్యోగాల వ్యవహారం కూడా సానుకూలతను పెంచింది. రాష్ట్రానికి టాటా టీసీఎస్, ఐబీఎం వంటి పెద్ద కంపెనీలను తీసుకురావడం, పరిశ్రమల పునరుద్ధరణ
ద్వారా యువతకు ఉపాధి కల్పనపై భరోసా పెరిగింది. ఇక, మైనస్‌ల విషయానికి వస్తే.. హామీల అమలులో జాప్యం సర్కారుకు ఇబ్బందిగా మారింది. 'సూపర్ సిక్స్' లోని హామీలైన నిరుద్యోగ భృతి, మహిళలకు 1500 వంటివి వర్తించకపోవడంపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉంది.

అలానే, ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున అప్పులు చేస్తోందని, దీనివల్ల భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుందనే ఆరోపణలను ప్రతిపక్షాలు గుప్పిస్తున్నాయి. ఇవి కూడా ప్రజల్లో చర్చకు వస్తున్నాయని సర్వేలు చెబుతున్నాయి. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలు చేసేవారిపై కేసులు పెట్టడం, ప్రతిపక్ష నాయకులను వేధించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు.

# హెచ్-1బీ సంక్షోభం.. అమెరికాను వీడుతున్న భారతీయ కుటుంబాలు!




ఒకప్పుడు "అమెరికా వెళ్తున్నాం బాబాయ్" అంటే బంధువుల కళ్లల్లో అసూయ... పొరుగువారి గుండెల్లో విస్మయం కనిపించేవి. డాలర్ల వర్షంలో తడిసి ముద్దయిపోవచ్చని.. పిల్లలకు పింక్ కార్డ్.. చేతికి గ్రీన్ కార్డ్ వచ్చేశాయని పండగ చేసుకునేవారు. కానీ కట్ చేస్తే.. ఇప్పుడు ఆ "అమెరికన్ డ్రీమ్" కాస్తా.. "హోమ్ లోన్ ప్లస్ హెచ్–1బీ" అనే నైట్ మేర్‌గా మారిపోయింది.

ఉద్యోగ భద్రత అనేది టెక్ రంగానికి దిష్టిచుక్కలా మారిపోవడంతో మన డల్లాస్, ఇర్వింగ్ అంకుల్స్ పరిస్థితి 'అటు ఉద్యోగం లేక.. ఇటు ఇల్లు అమ్మలేక' త్రిశంకు స్వర్గాన్ని తలపిస్తోంది. పదేళ్లు కష్టపడి సంపాదించిన డబ్బుతో "సెలినా, మెలిస్సా" ప్రాంతాల్లో రాజభవనాల్లాంటి ఇళ్లు కొంటే.. ఇప్పుడు ఆ ఇళ్ల విలువల కంటే బ్యాంకు మార్టేజ్ బకాయిలే భారీగా దర్శనమిస్తున్నాయి. దీనికే అమెరికన్లు ముద్దుగా 'అండర్‌వాటర్ మార్ట్‌గేజ్' అని పేరు పెట్టారు. అంటే నీటిలో మునిగిపోతున్నామని అర్థం.. ఐదు లక్షల డాలర్ల ఇల్లు కొంటే ఇప్పుడు దాని రేటు నాలుగు లక్షలకు పడిపోయింది. ఇల్లు అమ్మాలన్నా జేబులోంచి మరో లక్ష డాలర్లు తీసి బ్యాంకు ముఖాన కొట్టాలి. ఉద్యోగం పోయిన 60 రోజుల్లో కొత్త ఉద్యోగం వెతుక్కోవాలో.. లేక ఈ మార్ట్‌గేజ్ గోల తేల్చుకోవాలో తెలియక మనవాళ్లు తలలు పట్టుకుంటున్నారు.

ఇక వీసా నిబంధనల సంగతి సరేసరి. 60 రోజుల గ్రేస్ పీరియడ్ అంటే ఏదో రోడ్‌సైడ్ టిఫిన్ సెంటర్‌లో దోశ తిన్నంత వేగంగా ద

కరిగిపోతోంది. ఈ అనిశ్చితి, గ్రీన్ కార్డ్ కోసం దశాబ్దాల తరబడి చేసే నిరీక్షణ, నెలకు చెల్లించాల్సిన ప్రాపర్టీ ట్యాక్స్‌ల వాతలు భరించలేక... చాలామంది "చాలు మహాప్రభో ఈ డాలర్ల గోల" అని సైలెంట్‌గా సర్దుకుని స్వదేశానికి యూ–టర్న్ తీసుకుంటున్నారు. ఫ్లైట్ ఎక్కి హైదరాబాదో, బెంగళూరో వస్తున్న కుటుంబాలు ఇప్పుడు "అక్కడి కంటే ఇక్కడే పీస్ ఆఫ్ మైండ్ ఉందబ్బా" అని కవర్ చేసుకుంటున్నా లోలోపల మాత్రం అమెరికన్ డ్రీమ్ ఇచ్చిన షాక్ నుంచి తేరుకోవడానికి కాస్త సమయం పట్టేలానే ఉంది. మొత్తానికి 'డాలర్ డ్రీమ్స్' చూపిస్తూ అమెరికా ఇచ్చిన గిఫ్ట్.. ఇప్పుడు 'దేశం కాని దేశంలో రీసేల్ లేని ఇల్లు' అని తేలిపోయింది.

# మీరు ప్రభుత్వ ఉద్యోగులా.. అయితే సోషల్ మీడియాలో జాగ్రత్త!




మీరు ప్రభుత్వ ఉద్యోగులా.. అయితే.. సోషల్ మీడియాను వినియోగించే విషయంలో ఇకపై జాగ్రత్తలు పాటించకతప్పదు. ఎందుకంటే.. ఇకనుంచి సోషల్ మీడియాలో దూకుడుగా ఉండే ఉద్యోగులకు, వివాదాస్పద వ్యాఖ్యలు, రీల్స్ చేసే ఆఫీసర్లకు కేంద్ర ప్రభుత్వం చెక్ పెట్టనుంది. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వానికే కాదు.. అన్ని రాష్ట్రాలకు కూడా వర్తించేలా చేయాలని కేంద్రం ఆలోచన చేస్తోంది. దీనికి సంబంధించి తాజాగా ముగ్గురు మేధావులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం శాఖ తెలిపింది.

**ఇప్పటి వరకు వరకు..**

వాస్తవానికి ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా అంటే.. అటు కేంద్రంలోకానీ, ఇటు రాష్ట్రాల్లో కానీ పనిచేసేవారు.. రాజకీ యాలకు అతీతంగా వ్యవహరించాలి. ప్రభుత్వాలను విమర్శించరాదు. ప్రబుత్వ విధానాలు పాలకుల పనితీరులోని లోపాలను ఎత్తి చూపడానికి వీల్లేదు. ఈ మేరకు సర్వీసు రూల్స్ ఉన్నాయి. ఏ చిన్న తేడా వచ్చినా.. సర్వీసు రూల్స్ ప్రచారం విచారణ చేసి.. డిపార్ట్‌మెంటల్ క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. ఇది ఇప్పటి వరకు ఉన్న నిబంధన. అటు కేంద్రంలోను... ఇటు రాష్ట్రాల్లోనూ ఇది అమలవుతోంది. ఇటీవల ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం నేత కాకర్ల వెంటరామిరెడ్డిని ఏపీ ప్రభుత్వం ఈ సూత్రం ప్రకారమే ఉద్యోగం నుంచి తప్పించింది.

**ఇక నుంచి..**

ఇక, త్వరలోనే సోషల్ మీడియా విషయంలోనూ కొత్త నిబంధనలు తీసుకురానున్నారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్, ట్విట్టర్(ఎక్స్) సహా.. ఏ ఇతర మాధ్యమాల్లో అయినా.. ఉద్యోగులు తమ హద్దులు మీరి కామెంట్లు చేసినా.. రీల్స్ చేసినా.. పాలనలో ఉన్న నాయకులను ఇమిటేట్ చేసినా.. సదరు ఉద్యోగులపై చర్యలు తీసుకోనున్నారు. ఈ క్రమంలో కేసు తీవ్రతను బట్టి వారి ఉద్యోగం ఊడిపోయే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఒక వేళ కేసు తీవ్రత తక్కువగా ఉంటే.. ఇంక్రిమెంట్లలో కోత, పదోన్నతి నిరాకరణ వంటివి ఉండనున్నాయి.

**ఏం జరుగుతోంది?**

దేశవ్యాప్తంగా పలువురు సర్వీసులో ఉన్న ఉద్యోగులు, అధికారులు సైతం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారు. ప్రభు త్వాలు ఇస్తున్న పథకాలను, చేస్తున్న పనులను వారు తప్పుబడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇది సర్కారుకు ఇబ్బందిగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమంపై బీహార్, యూపీలకు చెందిన నలుగురు ఉన్నతాధికారులు సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వానికి ఇబ్బందిగా మారాయి. ఇక, రాష్ట్రాల్లోనూ పరిస్థితి అలానే ఉంది. ఈ నేపథ్యంలోనే కొత్త నిబంధనలు తీసుకువచ్చేందుకు కేంద్రం నడుం బిగించింది. ఇవి.. రిటైర్డ్ ఉద్యోగులకు కూడా వర్తించనున్నాయి.

# బిట్స్ పిలానీలో జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులు.. రూ.37 వేల వరకు స్టైపెండ్!



పిలానీ: బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (దీ×యూ్రాఅశ్రీఖఅఱ)లో జూనియర్ రీసెర్చ్ ఫెలో (జీ=ఖీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అర్హత ఉన్న అభ్యర్థులు నిర్ణీత గడువులో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**విద్యార్హత**

ఫిజిక్స్ లేదా మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్‌లో ఫస్ట్ క్లాస్‌తో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. బీఎస్సీలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.

**ముఖ్యమైన వివరాలు**

పోస్టు: జూనియర్ రీసెర్చ్ ఫెలో
స్టైపెండ్: నెలకు రూ.37,000 వరకు
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
చివరి తేదీ: సెప్టెంబర్ 30, 2026
ఎంపిక విధానం

అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించిన అనంతరం అర్హులైన వారిని షార్ట్‌లిస్ట్ చేస్తారు. అనంతరం ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా తుది ఎంపిక చేపడతారు.

అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు సంస్థ అధికారిక నోటిఫికేషన్‌లోని పూర్తి నిబంధనలు, అర్హతలను పరిశీలించాలి.

అధికారిక వెబ్‌సైట్: www.bits-pilani.ac.in

# వైభవ్ సూర్యవంశీ దూకుడుకు బ్రేకులు.. ఔట్ చేసిన తెలంగాణ డీజీపీ కొడుకు




దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్ పోరులో క్రికెట్ అభిమానులకు అసలైన వినోదం అందుతోంది. చెన్నైలోని ప్రఖ్యాత ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా సౌత్ జోన్, ఈస్ట్ జోన్ జట్ల మధ్య జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన దూకుడైన శైలి బ్యాటింగ్‌తో మరోసారి వార్తల్లో నిలిచాడు. అయితే క్రీజులో తుఫాన్ రేపుతున్న ఈ కుర్రాడిని హైదరాబాద్ పేసర్, తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కుమారుడైన సీవీ మిలింద్ అద్భుతమైన బంతితో పెవిలియన్‌కు పంపి సౌత్ జోన్‌కు బిగ్ బ్రేక్‌త్రూ అందించాడు.

ఈ ఫైనల్ పోరులో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ టాస్ గెలిచి ఎలాంటి సంకోచం లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. కెప్టెన్ నమ్మకాన్ని నిలబెడుతూ ఈస్ట్ జోన్ ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్, వైభవ్ సూర్యవంశీ ఇన్నింగ్స్ ప్రారంభం నుంచే సౌత్ జోన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా వైభవ్, ప్రత్యర్థి బౌలర్ల గణాంకాలతో సంబంధం లేకుండా బౌండరీల వర్షం కురిపించాడు.

భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ వేసిన ఓవర్లో వైభవ్ చూపించిన ధైర్యం అందరినీ ఆశ్చర్యపరిచింది. సిరాజ్ బౌలింగ్‌ను ఏమాత్రం లెక్కచేయకుండా ఒకే ఓవర్‌లో 14 పరుగులు రాబట్టాడు. ఇందులో ఒక భారీ సిక్సర్‌తో పాటు రెండు చూడముచ్చటైన ఫోర్లు ఉన్నాయి. కేవలం 37 బంతులు ఎదుర్కొన్న వైభవ్ 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 44 పరుగులు

చేసి.. సెంచరీ దిశగా సాగుతున్న వేళ స్టేడియం అంతా అతడి షాట్లకు హోరెత్తిపోయింది. ఓపెనర్లు ఇద్దరూ కలిసి తొలి వికెట్‌కు 100కు పైగా పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఈస్ట్ జోన్‌కు భారీ పునాది వేశారు. హాఫ్ సెంచరీకి కేవలం 6 పరుగుల దూరంలో ఉన్న వైభవ్‌ను అవుట్ చేయడానికి సౌత్ జోన్ కెప్టెన్ బౌలింగ్‌లో మార్పులు చేశాడు. ఈ క్రమంలో బంతి అందుకున్న హైదరాబాద్ స్పీడ్‌స్టర్ సీవీ మిలింద్ మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. ఇన్నింగ్స్ 15వ ఓవర్‌లో మిలింద్ సంధించిన పక్కా లైన్ అండ్ లెంగ్త్ బంతిని భారీ షాట్ ఆడబోయిన వైభవ్ టైమింగ్ పొరపాటైంది. దీంతో గాలిలోకి లేచిన బంతిని సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ తనయ్ త్యాగరాజన్ అద్భుతంగా క్యాచ్‌గా మలుచుకున్నాడు. దీంతో వైభవ్ ఆకర్షణీయమైన ఇన్నింగ్స్‌కు తెరపడింది. మరోవైపు సౌత్ జోన్ ప్రధాన బౌలర్లు మ్యాచ్ ప్రారంభంలో తీవ్రంగా శ్రమించారు. మహమ్మద్ సిరాజ్ తన తొలి స్పెల్‌లో 5 ఓవర్లలో 41 పరుగులు ఇచ్చుకోగా స్పిన్నర్ త్రిపురాణ విజయ్ 3 ఓవర్లలో 27 పరుగులు సమర్పించుకున్నాడు. వైభవ్ అవుట్ అయినప్పటికీ మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ బాధ్యతాయుతంగా ఆడుతూ అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. 19 ఓవర్లు ముగిసే సమయానికి ఈస్ట్ జోన్ ఒక వికెట్ నష్టానికి 120 పరుగులు చేసి దృఢమైన స్థితిలో నిలిచింది. మిలింద్ సాధించిన ఈ వికెట్ మ్యాచ్‌లో సౌత్ జోన్‌కు కొత్త ఊపిరి ఊదడంతో రాబోయే సెషన్లలో పోరు మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది.

# ప్లాస్టిక్కే పెనుభూతం.. 'నేపాల్' గుర్తు చేస్తోంది సోదరా!



వాడి పారేసే ప్లాస్టిక్ బాటిళ్లు.. తాగి పారేసే.. వాటర్ ప్యాకెట్లు.. ఇవన్నీమనకు చాలా తేలిక!. చాలా సులువు కూడా!. ఇక , ఒకప్పుడు కుటుంబంలోని వారు ఏ పనిపై బయటకు వచ్చినా.. చేతిలో సంచీని మాత్రం వదిలి పెట్టేవారు కాదు. ఎందుకంటే.. ఏం తీసుకురావాలన్నా.. సంచీలు కావాలి కాబట్టి!. కానీ, ఇప్పుడు షాపింగు కోసమే బయటకు వచ్చినా. .. వెచ్చాల కోసం.. ఇంటి నుంచి బయలు దేరినా.. ఒక్కరు కూడా సంచీతీసుకుని బయటకు రావాలన్న స్పృహను కనబరచలేకపోతున్నారు. దీనికి కారణం.. ఆ కొట్టువాడే ప్లాస్టిక్ సంచీ ఇస్తాడన్న భరోసా!!.

కానీ, ఈ ప్లాస్టిక్కే పెనుముప్పుగా మారుతోంది. ప్రకృతికి శాపంగా కూడా.. పరిణమిస్తోంది. తాజాగా నేపాల్‌లో సంభవిం చిన ప్రకృతి విలయం.. వేలాది మంది ప్రాణాలను బలితీసుకుంది. అదేసమయంలో మరిన్ని వేల మందిని నిరా శ్రయులను చేసింది. కన్నుమూసి తెరిచే లోగా.. విరుచుకుపడ్డ వరద.. ప్రజలను అతలాకుతలం చేసింది. ఫలితం గా నిలువ నీడ కోసం.. ఏళ్ల తరబడి కష్టించి దాచుకున్న సొమ్ము కోసం.. ప్రజలు పడుతున్న ఆవేదనకు అంతులే కుండా పోయింది. ప్రభుత్వాలు సాయం చేస్తున్నా.. అది ఏమూలాకు! అనే ప్రశ్న కూడా వస్తోంది.

**వరదే కదా!**

ఇక్కడ ఓ సందేహం వస్తుంది.. నేపాల్‌లో సంభవించిన వరదలకు.. ప్లాస్టిక్‌కు మధ్య లింక్ ఏంటి? అని. ఇదే విష యాన్ని తాజాగా ప్రపంచ విపత్తు, పర్యావరణ విభాగం నిశితంగా వివరించింది. వరదలు రావడానికి కారణం భూమి వేడెక్కిపోవడమట!. భూములు వేడెక్కిన కారణంగా.. హిమాలయాలు కరిగిపోయి.. ఆ నీరు వరద రూపంలో ముంచుకు వస్తోందన్నది ప్రపంచ సంస్థ చేసిన హెచ్చరిక. ప్లాస్టిక్ కారకాలు.. భూమిలో కరిగిపోకపోవడంతో నేల తల్లి నిలువెల్లా మండిపోతోందని చెబుతున్నారు. ఉదాహరణకు.. ఒక వ్యక్తి ఏదైనా తిన్నాక.. అది జీర్ణంకాకపోతే.. ఎలా అయితే గ్యాస్ ఫామై.. కడుపు ఉబ్బిపోతుందో.. అలానే భూమి తల్లి కూడా.. ప్లాస్టిక్‌ను జీర్ణించుకోలేక.. ఇబ్బందిపడుతుందని వివరించారు. దీనికితోడు.. కరువవు తున్న పచ్చదనం కూడా.. కడలికి శాపంగా మారుతోంది. తద్వారా.. సముద్రాలు ఉప్పొంగుతున్నాయి. ఇలా జరిగే.. నేపాల్ అతలాకుతలం అయిందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని.. చెట్లను పెంచాలని సూచిస్తున్నారు. హిమాలయాలకు చేరువగా ఉన్న దేశాల్లో భారత్ కూడా ఉంది. మరి మనమూ కొన్ని జాగ్రత్తలు ఇప్పటికైనా తీసుకుందామా? లేక.. నేపాల్ మాదిరి సంక్షోభం వచ్చే వరకు వేచి చూద్దామా? అనేది మన చేతుల్లోనే ఉంది!.

# బీజేపీకి ఆశలున్నాయి... గ్రౌండ్ లెవెల్ లో సీన్ ఏంటి ?




ఏపీలో కూటమిలో మూడవ మిత్రపక్షంగా బీజేపీ ఉంది. రెండు ప్రాంతీయ పార్టీల మధ్య ఒక జాతీయ పక్షంగా ఉంది. అయితే పెద్దన్నగా టీడీపీ కూటమి ఉంటే రెండో పార్టీగా జనసేన తన ప్రాధాన్యతను కాపాడుకుంటోంది. బీజేపీ మాత్రం జూనియర్ మిత్రుడిగానే ఉంది. ఏపీలో రెండేళ్ల అధికారం తరువాత కూడా బీజేపీ తన బలాన్ని పెద్దగా పెంచుకోలేకపోయింది అని అంటున్నారు. 2024 ఎన్నికల్లో కూటమితో ఉన్న పొత్తుల కారణంగా 10 ఎమ్మెల్యే సీట్లకు 8 దక్కాయి. అలాగే అయిదు ఎంపీ సీట్లకు మూడు దక్కించుకుంది. అప్పట్లో నూటికి నూరు శాతం ఓట్ల బదలాయింపు జరిగింది. ఆ ఫలితాన్ని కమలం పార్టీ అనుభవించింది. కానీ స్థానిక సంస్థల ఎన్నికలు అంటే పూర్తిగా గ్రౌండ్ లెవెల్ లో ఉండే రాజకీయాలను బట్టి ఆధారపడి ఉంటాయి. పై స్థాయిలో పార్టీ అగ్ర నాయకత్వం ఎంతగా ప్రయత్నం చేసినా పూర్తిగా నియంత్రించలేని స్థితి ఉంటుంది అని అంటున్నారు. స్థానికం కాబట్టి ఎవరి అభిప్రాయాలు వారివిగా స్వేచ్ఛగా ఉంటారని అంటున్నారు.

**నితిన్ నబీన్ దిశా నిర్దేశం :**

ఇక చూస్తే ఇటీవలనే ఏపీ పర్యటనకు వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విశాఖలో జరిగిన పార్టీ రాష్ట్ర సాయి నేతల సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గణనీయంగా ఫలితాలు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికలు చాలా కీలకంగా కూడా చెప్పారు. బీజేపీ తన పరిస్థితిని మెరుగుపరచుకోవాలని ప్రతీ చోటా బీజేపీ ఉనికి చాటుకోవాలని సూచించారు. అయితే జాతీయ పార్టీ చెప్పినంత సులువు అయితే కాదని అంటున్నారు. ఏపీలో బీజేపీకి క్షేత్ర స్థాయిలో బలం అయితే పెద్దగా పెరగలేదు, పార్టీకి ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులు కూడా ఉన్నారు. అలాగే సీనియర్ నాయకులు ఉన్నారు, కానీ పార్టీని జనంలోకి తీసుకుని వెళ్ళి పటిష్టం చేసే పని పెద్దగా జరిగింది లేదని అంటున్నారు. దాంతో ఈసారి కూడా పొత్తులలో భాగంగా టీడీపీ సీట్లు ఇస్తే వారి నుంచి ఓట్ల బదిలీ సక్రమంగా జరిగితే బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

**ప్రత్యక్ష ఎన్నికలతోనే :**

మేయర్ జెడ్పీ చైర్మన్ వంటివి ప్రత్యక్ష ఎన్నికలుగా ఉన్నాయి. దాంతో వాటిలో గెలవాలి అంటే కచ్చితంగా సొంత బలం కొంత అయినా ఉండాలి. ఆ మీదట మిత్రుల సపోర్టు ఉంటుంది. ఒకవేళ అలా కాకుండా పొత్తులలో కేటాయించిన టీడీపీ నుంచి ఏ మేరకు ఓట్ల బదిలీకి గ్రౌండ్ లెవెల్ లో క్యాడర్ సహకరిస్తుందని ప్రశ్నలు ఉన్నాయి. అలా జరగకపోతే బీజేపీకి ఇచ్చిన సీట్లలో వైసీపీకే రాజకీయ లాభం కలుగుతుందని కూడా కూటమిలో చర్చ సాగుతోంది. ఇక ఏపీలో ఏ పార్టీకి ఎంత బలం ఎక్కడెక్కడ ఉంది అన్నది కూటమి పెద్దలు కూడా అంచనా వేసుకుంటున్నారని అంటున్నారు. దానిని బట్టే సీట్ల సర్దుబాటు ఉండొచ్చు అని చెబుతున్నారు.

**అయిదు శాతం సీట్లు మాత్రమే :**

ప్రత్యక్ష ఎన్నికలు అంటే అంగబలం అర్థబలం ఉండాలని బిగ్ షాట్స్ రంగంలోకి దిగితే కానీ విజయం చేకూరదని చెబుతున్నారు. బీజేపీ లాంటి పార్టీలు ఈ విషయంలో ఏ మేరకు ప్రభావం చూపించగలవన్నది కూడా చర్చిస్తున్నారు. అయిదు శాతం సీట్లు మాత్రమే బీజేపీకి ఇస్తామని అంటున్నారు అని ప్రచారం ఆ మధ్య సాగింది. అదే నిజం అయితే మేయర్ జెడ్పీ చైర్మన్ల విషయంలో ఏమైనా దక్కుతాయా మున్సిపల్ చైర్మన్లలో ఎన్ని వస్తాయి అన్నది కూడా కమలం పార్టీలో డిస్కషన్ సాగుతోంది. అదే సమయంలో ఎక్కువ సీట్లు కావాలని పార్టీలో క్యాడర్ కోరుతున్నారు కానీ సీట్లు తీసుకుని పోటీ చేసి ఓటమి పాలు అయితే కూటమిలోనూ జాతీయ నాయకత్వం వద్ద కూడా చెప్పుకోవడానికి ఇబ్బంది అవుతుందని కూడా పార్టీ పెద్దలు ఆలోచిస్తున్నారని అంటున్నారు.

## వైఎస్ షర్మిల కుమార్తె వివాహం.. వరుడు ఎవరో తెలుసా?



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల ఇంట త్వరలో పెళ్లి సందడి నెలకొననుంది. ఆమె కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం నిశ్చయమైంది. ఈ విషయాన్ని షర్మిల స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తమ కుమార్తె వివాహం నిశ్చయమైన శుభవార్తను కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

షర్మిల కుమార్తె అంజలి రెడ్డి.. సోమల సుబ్బారెడ్డి, పద్మారెడ్డి దంపతుల కుమారుడు డాక్టర్ సోమల రఘురామ్ రెడ్డిని వివాహం చేసుకోనున్నారు. రఘురామ్ రెడ్డి కుటుంబానిది ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా స్వస్థలం కాగా.. ప్రస్తుతం వారు అమెరికాలో స్థిరపడ్డారు. కుటుంబ సభ్యులంతా అమెరికా పౌరులేనని షర్మిల తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.

**కాబోయే అల్లుడు డాక్టర్ రఘురామ్ రెడ్డి**

డాక్టర్ రఘురామ్ రెడ్డి అమెరికాలో వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. ఆయన యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌లో మెడిసిన్ చదివినట్లు సమాచారం. ప్రస్తుతం టెన్నెస్సీ రాష్ట్రంలోని నాష్‌విల్‌లో వైద్యుడిగా పనిచేస్తున్నారు. అంజలి రెడ్డి కూడా అమెరికాలోనే ఉన్నత విద్యను అభ్యసించారు. ఆమె బీబీఏ డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ఫైనాన్స్ రంగంలో అడుగుపెట్టారు. ప్రస్తుతం అమెరికాలో ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.

**షర్మిల భావోద్వేగ పోస్ట్**

కుమార్తె వివాహం నిశ్చయమైన సందర్భంగా షర్మిల ఆనందం వ్యక్తం చేశారు. తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి దేవుడికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. అంజలి రెడ్డి, డాక్టర్ రఘురామ్ రెడ్డి వివాహం నిశ్చయమైన విషయాన్ని అందరితో పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ శుభ సందర్భంలో తమ కుటుంబానికి స్నేహితులు, శ్రేయోభిలాషుల ప్రార్థనలు, ఆశీస్సులు అందించాలని ఆమె కోరారు. అయితే అంజలి రెడ్డి--రఘురామ్ రెడ్డి వివాహం ఎప్పుడు, ఎక్కడ జరగనుంది అనే వివరాలను మాత్రం షర్మిల వెల్లడించలేదు. త్వరలోనే వివాహ తేదీ, వేదికకు సంబంధించిన వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. షర్మిల తన కుమార్తెతో పాటు కాబోయే అల్లుడు రఘురామ్ రెడ్డి ఫొటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, వైఎస్ కుటుంబ అభిమానులు నూతన జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

**ఇప్పటికే కుమారుడు రాజారెడ్డి వివాహం**

వైఎస్ షర్మిలకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె కుమారుడు వైఎస్ రాజారెడ్డి వివాహం 2024 ఫిబ్రవరిలో అట్లూరి ప్రియతో జరిగింది. రాజారెడ్డి--ప్రియ వివాహ వేడుక రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి ముందు షర్మిల తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని స్వయంగా కలిసి వివాహానికి ఆహ్వానించారు. జగన్ నిశ్చితార్థ వేడుకకు హాజరైనప్పటికీ జోధ్‌పూర్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరు కాలేదు. ఇప్పుడు షర్మిల కుమార్తె అంజలి రెడ్డి వివాహం కూడా నిశ్చయమవడంతో వైఎస్ కుటుంబంలో మరోసారి పెళ్లి సందడి మొదలుకానుంది. అమెరికాలో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో స్థిరపడిన అంజలి రెడ్డి, డాక్టర్ రఘురామ్ రెడ్డి త్వరలో వివాహ బంధంతో ఒక్కటవ్వనున్నారు. దీంతో ఈ వివాహ వేడుక ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనే అంశంపై వైఎస్ కుటుంబ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ పెళ్లికి అయినా వైఎస్ జగన్ వస్తారో రారో వేచిచూడాలి.

## పకోడి వైపు తొంగి చూడకు బ్రో !

నీ జీవితం బాగుండాలి అంటే పోలికలు పెట్టుకోవద్దు. అసలు అలాంటి ఆలోచనలే వద్దే వద్దు. నీ జీవితం నీ ఇష్టం. ఎవరీది వారికే ఉంటుంది. కవలలుగా పుట్టినా కూడా ఆ ఇద్దరి బతుకులూ ఒకేలా ఉండవు. అలాంటిది పకోడి లైఫ్ తో నీ లైఫ్ ని ఎలా పోల్చుకుంటావ్ బ్రో. అసలు ఎందుకు ఇలాంటి ఆలోచనలు. దీని వల్ల బాధ తప్ప ఒరిగేది ఏముంది. నిజం చెప్పాలీ అంటే అదంతా ఈ ఒట్టి భ్రమ తప్ప పకోడు ఏమీ సుఖపడిపోవడం లేదు, ఆ పకోడి పక్కన ఉన్న బలిసినోడు అని నీవు అనుకుంటున్నావే వాడు కూడా ఏమి ఖుషీగా లేడు. అంతా పైపైకి మెరుగులే. అంతా మేకప్పులు పూసుకుని నవ్వుల పౌడర్లు ముఖానికి రాసుకుని బయట జాలీగా తిరిగేస్తూ ఫోజులు ఇస్తున్నారు తప్పించి ఎవరి బతుకు చూసినా ఏముంది గర్వ కారణం సమస్త బాధల చిత్రం అని నీకు ఎప్పుడు అర్థమవుతుంది బ్రో.

**ప్రాబ్లమ్స్ నీకేనా :**

సమస్యలు వస్తే వస్తాయి, అవి కూడా మనుషులకే వస్తాయి. గట్టిగా చెప్పాలంటే ఎంత ఎక్కువగా ఆలోచిస్తే అంతగా సమస్యలు చుట్టుముడతాయి. వాటిని పట్టుకుని వేలాడుతూ అందులోనే పడి కిందా మీద అయిపోతూ నా జీవితం వేస్టు అనుకుంటే అక్కడితో నీవు పాతాళం అంచులు చూసేసినట్లే. నిన్ను ఎవడూ కాపాడలేడు బ్రో. ఎందుకంటే ఒక్కసారి నీవు తెలివి తెచ్చుకుని చూస్తే అందరి జీవితాల్లోనూ సమస్యలు ఉన్నాయి. ప్రతీ వారినీ చికాకులు సతమతం పెడుతూనే ఉన్నాయి. బాధలు అన్నవి బంధాలుగా పట్టుకుని పీడిస్తూనే ఉన్నాయి. అయితే వాటిని ఒక్కొక్కరు ఒక్కోలా డీల్ చేస్తారు, అతిగా ఆలోచించి ఆవేదన చెందేవారే ఈజీగా వాటికి చిక్కిపోతూంటారు.

**సవాళ్లు లేకపోతే ఎలా :**

ప్రశ్న ఉంటేనే జవాబు వెతకాలనిపిస్తుంది. అలాగే సవాళ్ళు లేకపోతే జీవితం ఎలా సాగుతుంది. అన్నీ తన చుట్టూ ఉన్నా అష్ట ఐశ్వర్యాలు తనతోనే ఉన్నా కూడా సిద్ధార్థుడు ఎంతో లోటుగా భావించాడు, తనకు ఏదో కరవు అయిందని కూడా ఆలోచించాడు. చివరికి జ్ఞానం కోసం అంతపురాలని దాటుకుంటూ బయటకు వచ్చిన సిద్ధార్థుడు అలా గౌతమ బుద్ధుడు అయ్యాడు. దీనిని బట్టి అర్థం అయ్యేది ఏమిటి. ఎంత సుఖాలు ఉన్నా కూడా మనసుకు శాంతి ఉండదు, అసలు మనసుకు ఆనందం కావాలీ అంటే అది ఎక్కడో భౌతికంగా కనిపించే దాంట్లో లేదు. మనసులో ఉంది. ఆనందాన్ని అక్కడ సృష్టించుకోవాలి. అపుడు నీ కంటే అదృష్టవంతుడు ఉండడు బ్రో.

**నీ నుంచి దూరంగా :**

అసలు నీవు నీ నుంచి కాస్తా దూరంగా వెళ్ళి ఆలోచించడం మొదలెట్టు. నీకు నీవే సలహా ఇచ్చుకో. నీవు అన్న మరో మనిషికి మంచి సూచనలు ఇవ్వడం మొదలెట్టు. ఆనందంగా ఉండడం ఎలాగో తెలియచెప్పు. అపుడు ఉంటుంది కదా అసలైన సంతోషం. పుట్టిన ప్రతీ రోజూ బోలెడు కష్టాలను మోసుకుని వస్తుంది. అలాగే సమస్యలు కూడా వెంటనే ఉంటాయి. అలా అన్నీ ఉండవు, వాటి మధ్యలోనో చివరలోనో ఏదో ఆనందం కలిగించే చిన్నపాటి విషయం కూడా ఉంటుంది. నీవు దానికే పెద్దగా చూడడం నేర్చుకో. సమస్యలను కొండంత చేసుకుని కూర్చుంటే వాటి అడుగున పడి రవ్వంత సంతోషం కూడా చితికిపోతుంది.

**కాగితం పడవగా చేసుకుని :**


అందుకే దానినే కొండంతగా చూడు, అలా ఆలోచించడంలోనే నీ గొప్పదనం ఉంది. అపుడే ఆనందం కూడా నీ సొంతం అవుతుంది. ఒక్క మాట బ్రో. అమ్మ కడుపులో నీవు ప్రాణం పోసుకున్నప్పటి నుంచే కష్టాలు బాధలూ వెన్నంటే ఉంటాయి. వాటినే చూస్తూ కృంగిపోవడం మొదలెడితే నీవు కొట్టుకుపోతున్నట్లే. అందుకే కాస్తా ఆగి ఏ చిన్నపాటి సంతోషం కనిపించినా పొదివి పట్టుకో. దానినే కాగితం పడవగా చేసుకుని కష్టాల కడలిని ఈదడం నేర్చుకో. జీవితం అంటే మూడు అక్షరాలు మూడు క్షణాలు అని గుర్తు పెట్టుకుంటే చాలు, బాధలు ఎంత చిన్నవో ఇంకా బాగా అర్థం అవుతుంది.

# గర్భిణి మీద 'టార్చ్'

గర్భంలోని పిండం, పుట్టిన శిశువు సరిగా ఎదగటంలో తల్లి ఆరోగ్యమే కీలకం. గర్భధారణ సమయంలో తలెత్తే ఎలాంటి ఇన్‌ఫెక్షన్లయినా బిడ్డ మీద విపరీత ప్రభావం చూపొచ్చు. టార్చ్ (టీఓఆర్‌సీహెచ్) ఇన్‌ఫెక్షన్లు మరింత ప్రమాదకరం. అందుకే వీటిని ముందుగానే గుర్తించటం చాలా ముఖ్యం. ఇందుకు తేలికైన రక్త పరీక్ష ఎంతగానో తోడ్పడుతుంది. ఇంతకీ దీని ప్రాధాన్యమేంటి? ఎవరికి అవసరం? ఎలా ఉపయోగపడుతుంది?

గర్భంలోని పిండం, పుట్టిన శిశువు సరిగా ఎదగటంలో తల్లి ఆరోగ్యమే కీలకం. గర్భధారణ సమయంలో తలెత్తే ఎలాంటి ఇన్‌ఫెక్షన్లయినా బిడ్డ మీద విపరీత ప్రభావం చూపొచ్చు. టార్చ్ (టీఓఆర్‌సీహెచ్) ఇన్‌ఫెక్షన్లు మరింత ప్రమాదకరం. అందుకే వీటిని ముందుగానే గుర్తించటం చాలా ముఖ్యం. ఇందుకు తేలికైన రక్త పరీక్ష ఎంతగానో తోడ్పడుతుంది. ఇంతకీ దీని ప్రాధాన్యమేంటి? ఎవరికి అవసరం? ఎలా ఉపయోగపడుతుంది?

గర్భిణులకు సాధారణంగానే రోగనిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. దీంతో ఇన్‌ఫెక్షన్ల ముప్పూ పెరుగుతుంది. అందువల్ల జాగ్రత్త తప్పనిసరి. ముఖ్యంగా టార్చ్ ఇన్‌ఫెక్షన్ల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. టార్చ్ అంటే? ఇన్‌ఫెక్షన్ల తొలి అక్షరాల సముదాయం. టి (టాక్సోప్లాస్మోసిస్), ఓ (హెచ్‌ఐవీ, సిఫిలిస్, పార్వోవైరస్ వంటి ఇతర ఇన్‌ఫెక్షన్లు), ఆర్ (రుబెల్లా), సీ (సైటోమెగాలో వైరస్), హెచ్ (హెర్పిస్ సింప్లెక్స్ వైరస్).. వీటన్నింటినీ స్ఫురించేలా ఈ పేరు పెట్టారన్నమాట. ఇవి గర్భధారణ సమయంలో, కాన్పు సమయంలో తల్లి నుంచి బిడ్డకు సంక్రమించే ప్రమాదముంది. జబ్బులను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి పిండానికి ఉండదు కాబట్టి టార్చ్ ఇన్‌ఫెక్షన్లు గర్భధారణ సమయంలో చిక్కులు కలిగించొచ్చు. పిండం సరిగా ఎదగకపోవచ్చు. అవయవ లోపాలతో పుట్టొచ్చు. ఇన్‌ఫెక్షన్ల రకాలు, ఎదుగుతున్న సమయంలో వాటికి ఎంత సమయం వరకూ గురయ్యారనే దాన్ని బట్టి దుష్పరిణామాలు ఆధారపడి ఉంటాయి. గర్భం ధరించిన తొలిదశలో ఇవి దాడి చేస్తే మరింత ఎక్కువ నష్టం కలగొచ్చు. ఇక్కడే వీటిని గుర్తించే టార్చ్ పరీక్ష ప్రాధాన్యం సంతరించుకుంటోంది.



### ఇదెలా ఉపయోగపడుతుంది?

ఇన్‌ఫెక్షన్ల బారినపడ్డప్పుడు వాటిని ఎదుర్కోవటానికి శరీరం కొన్ని యాంటీ బాడీలను సృష్టించుకుంటుంది. వీటిని గుర్తించటమే టార్చ్ పరీక్ష ప్రత్యేకత. గర్భిణికి గానీ పిండానికీ గానీ ఇన్‌ఫెక్షన్ల లక్షణాలుంటే ఈ పరీక్ష చేస్తారు. తల్లికి ఇటీవలే ఇన్‌ఫెక్షన్ సోకిందా? ఇంతకుముందు ఎప్పుడైనా సోకిందా? అసలు జబ్బే లేదా? అనేవి ఇందులో తెలుస్తాయి. కాన్పు తర్వాత తల్లికి లేదా శిశువుకు ఇన్‌ఫెక్షన్ సోకినట్టు అనుమానించినప్పుడూ ఈ పరీక్ష చేస్తారు.

గర్భిణుల్లో అనుమానించేదెలా?

మామూలుగా గర్భిణులకు చేసే అల్ట్రాసౌండ్ స్కాన్‌లో పిండం ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన సూచికలు ఉన్నట్టయితే అనుమానిస్తారు. కొన్నిసార్లు జ్వరం, చర్మం మీద దద్దు వంటి లక్షణాలతోనూ జబ్బులను పోల్చుకోవచ్చు. ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నవారికి గర్భిణులు సన్నిహితంగా ఉన్నప్పుడు లక్షణాలేవీ లేకపోయినా అనుమానించాల్సి ఉంటుంది.

గర్భస్థ శిశువులో అనుమానించేదెలా?

**పిండం ఎదుగుదల సరిగా లేనప్పుడు.**

స్కాన్ పరీక్ష చేసినప్పుడు కొన్నిసార్లు కడుపు భాగంలో ప్రకాశవంతమైన గీతల వంటి ఆకారాలు కనిపించొచ్చు. ఇవి రుబెల్లా ఇన్‌ఫెక్షన్‌కు సంకేతం కావొచ్చు.

గుండెలో లోపాలు.. ముఖ్యంగా పల్మనరీ కవాటం సంకోచించటం, గోడల మధ్య పొరలో రంధ్రం ఉండటం.

పిండం ఉబ్బటం (ఫీటల్ హైడ్రాప్స్). పార్వోవైరస్ ఇన్‌ఫెక్షన్ మూలంగా రక్తహీనత తలెత్తి పిండం శరీరమంతంటా ద్రవాలు పేరుకుపోతాయి. దీంతో పిండం ఉబ్బుతుంది.

### కాన్పు తర్వాత కూడా

పుట్టిన తర్వాత శిశువులో ఇన్‌ఫెక్షన్లకు సంబంధించిన లక్షణాలు కనిపిస్తే తల్లీ, బిడ్డా ఇద్దరికీ పరీక్ష అవసరమవుతుంది. ఆ లక్షణాలు ఇవీ..

తల్లి కడుపులో పిండం క్రమంగా పెరుగుతూ వస్తుంది. ఆయా నెలల్లో ఉండాల్సిన దాని కన్నా చాలా తక్కువ సైజుతో బిడ్డ పుట్టినప్పుడు.

వినికిడి లోపించటం, మానసిక ఎదుగుదల తగ్గటం.

మూర్ఛ.

పుట్టుకతో గుండె లోపాలు.

శుక్లాలు.

కాలేయం, ప్లీహం పెద్దగా ఉండటం.

ప్లేట్‌లెట్ల సంఖ్య తక్కువగా ఉండటం.

కామెర్లు.

### ఎవరికి అవసరం?

గర్భిణులందరికీ టార్చ్ పరీక్ష అవసరం లేదు. కాబట్టి దీన్ని ఎవరికి చేయాలనేది గుర్తించటం చాలా ముఖ్యం. గైనకాలజిస్ట్, పిండానికి చికిత్స చేసే నిపుణులు, మైక్రోబయాలజిస్ట్ కలిసి ఎవరికి పరీక్ష అవసరమో నిర్ణయిస్తారు. ఇప్పుడు ఆయా ఇన్‌ఫెక్షన్లను వేర్వేరుగా గుర్తించే పీసీఆర్ వంటి పరీక్షలూ ఉన్నాయి. మైక్రో బయాలజిస్ట్ సలహా మేరకు వీటిని చేయాల్సి ఉంటుంది. ఇన్‌ఫెక్షన్ తొలిదశలో సూక్ష్మక్రిముల కల్చర్ లేదా యాంటీజెన్‌లను గుర్తించే పరీక్షలూ అవసరమవ్వచ్చు.

టార్చ్ ఇన్‌ఫెక్షన్లు ఎలా సోకుతాయి?

**టాక్సోప్లాస్మోసిస్:** ఇది పరాన్నజీవితో తలెత్తుంది. సరిగా ఉడికించని మాంసం లేదా పిల్లి మలం ప్రభావానికి గురికావటం వల్ల సోకుతుంది.

**హెచ్‌ఐవీ, సిఫిలిస్:** లైంగిక సంపర్కం, వైరస్‌తో కూడిన రక్తం వంటి వాటితో సంక్రమిస్తాయి.

**పార్వోవైరస్:** ఇది పెంపుడు జంతువుల నుంచి సంక్రమించే ఇన్‌ఫెక్షన్. ఇది జలుబు మాదిరిగా శ్వాస, దగ్గు, లాలాజలం ద్వారా ఒకరి నుంచి మరొకరికి అంటుకుంటుంది. రక్తం ద్వారానూ వ్యాపించొచ్చు.

రుబెల్లా: ఇప్పుడు చాలామంది రుబెల్లా టీకా వేయించు కుంటున్నారు. అందువల్ల ఇది అరుదనే చెప్పుకోవచ్చు. అయితే చిన్నప్పుడు ఎంఎంఆర్ టీకా వేయించుకోకపోతే తల్లి నుంచి బిడ్డకు సంక్రమించొచ్చు.

సైటోమెగాలో వైరస్: ఇదోరకం హెర్పిస్ వైరస్. ఇది లాలాజలం, ఇతర శరీర స్రావాల ద్వారా వ్యాపిస్తుంది.

హెర్పిస్ సింప్లెక్స్ వైరస్: ఇది ప్రధానంగా ఒకరి చర్మానికి మరొకరి చర్మం నేరుగా తాకటం ద్వారా సంక్రమిస్తుంది.

ఫలితాల అర్థమేంటి?

టార్చ్ పరీక్ష ఫలితాలను పాజిటివ్ లేదా నెగెటివ్‌గా సూచిస్తారు. ఆయా సూక్ష్మక్రిములకు సంబంధించిన ఐజీజీ, ఐజీఎం యాంటీబాడీలు ఉన్నట్టయితే పాజిటివ్‌గా, లేకపోతే నెగెటివ్ ఫలితం కనిపిస్తుంది.

గర్భిణుల్లో ఐజీఎం యాంటీబాడీలు ఉన్నట్టయితే అప్పుడు ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతున్నారని అర్థం.

ఐజీజీ యాంటీబాడీ ఉండి, ఐజీఎం లేనట్టయితే అప్పుడు ఇన్‌ఫెక్షన్ చురుకుగా లేదన్నమాట.

ఐజీజీ యాంటీబాడీ ఉంటే గతంలో ఏదో ఒక టార్చ్ ఇన్‌ఫెక్షన్ బారినపడి ఉండొచ్చనే దానికి సంకేతం. ఇప్పుడు దాన్ని ఎదుర్కొనే రోగ నిరోధకశక్తిని సంతరించుకున్నారని భావిస్తారు.

ఒకసారి పరీక్ష చేశాక రెండు వారాల తర్వాత మరోసారి పరీక్ష చేసి చూస్తారు. రెండో పరీక్షలో ఐజీజీ యాంటీబాడీ మోతాదులు పెరిగినట్టయితే ఇటీవల ఇన్‌ఫెక్షన్ బారినపడినట్టు భావిస్తారు. ఒకవేళ రెండోసారి పరీక్షలో యాంటీబాడీల మోతాదులు పెరగకపోతే గర్భిణికి గతంలో ఇన్‌ఫెక్షన్ వచ్చి ఉండొచ్చని, ఇప్పుడు దాన్ని ఎదుర్కోవటానికి రోగనిరోధశక్తిని సంతరించుకొని ఉండొచ్చని అనుకోవచ్చు.

# నడుము జాగ్రత్త సుమా

మనల్ని నిటారుగా ఉంచేది, తేలికగా కదలటానికి తోడ్పడేది వెన్నెముకే. అయినా దీన్ని పెద్దగా పట్టించుకోం. ఇష్టమున్నట్టుగా కూర్చుంటాం, లేస్తుంటాం. ఎడాపెడా బరువులు ఎత్తేస్తుంటాం. ఏదైనా నొప్పి పుట్టేంతవరకూ అసలు వెన్నెముక ఉందన్న సంగతే మరచిపోతుంటాం. మొదట్లో నొప్పి కొద్దిగానే ఉండొచ్చు. ఏదో ఒక వైపునకు వంగినప్పుడో, తిరిగినప్పుడో నొప్పిగా అనిపించొచ్చు. క్రమంగా తీవ్రమై, పనులు చేసుకోవటానికీ ఇబ్బంది కలగొచ్చు.

మనల్ని నిటారుగా ఉంచేది, తేలికగా కదలటానికి తోడ్పడేది వెన్నెముకే. అయినా దీన్ని పెద్దగా పట్టించుకోం. ఇష్టమున్నట్టుగా కూర్చుంటాం, లేస్తుంటాం. ఎడాపెడా బరువులు ఎత్తేస్తుంటాం. ఏదైనా నొప్పి పుట్టేంతవరకూ అసలు వెన్నెముక ఉందన్న సంగతే మరచిపోతుంటాం. మొదట్లో నొప్పి కొద్దిగానే ఉండొచ్చు. ఏదో ఒక వైపునకు వంగినప్పుడో, తిరిగినప్పుడో నొప్పిగా అనిపించొచ్చు. క్రమంగా తీవ్రమై, పనులు చేసుకోవటానికీ ఇబ్బంది కలగొచ్చు.

### పెద్ద సమస్యే

నడుం నొప్పి తరచూ చూసేదే. 30-50 ఏళ్ల వయసువారిలో సుమారు 20% మంది ఏదో ఒక సమయంలో నడుం నొప్పిని అనుభవించినవారే. అన్ని వృత్తుల్లోనూ గైర్హాజరీకి ప్రధాన కారణాల్లో ఇదొకటి. ప్రపంచవ్యాప్తంగా నడుం నొప్పి సమస్య బారినపడుతున్నవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది.

జీవనశైలి మారటంతో..

**రకరకాల జీవనశైలి అంశాలు నడుం నొప్పికి దారితీస్తున్నాయి.**

శారీరక శ్రమ తగ్గటం

ఊబకాయం

కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, మొబైల్ ఫోన్లు చూస్తూ గంటల కొద్దీ ముందుకు వంగటం

భంగిమకు సరిపడిన కుర్చీలు, టేబుళ్ల వంటివి వాడకపోవటం

ఇలాంటివి పెద్దవారిలోనే కాదు, పిల్లల్లోనూ నడుం నొప్పికి కారణమవుతున్నాయి.

### మహిళలకు మరింత ముప్పు

నడుం నొప్పి ముప్పు మహిళలకు ఎక్కువ. గర్భధారణ సమయంలో శరీరాన్ని నిటారుగా ఉంచుకునే క్రమంలో భంగిమ దెబ్బతింటుంది.



హార్మోన్ల మార్పులు.. ముఖ్యంగా రిలాక్సిన్ అనే హార్మోన్ విడుదల కావటం వల్ల కండరాలు, కండర బంధనాలు బలహీన మవుతాయి. కాన్పు తర్వాత తగిన వ్యాయామాలు చేయకపోతే తాత్కాలికంగా మొదలైన నడుం నొప్పి క్రమంగా దీర్ఘకాల సమస్యగానూ మారుతుంది.

పెద్ద పెద్ద బరువులు ఎత్తే కార్మికులకూ నడుం దెబ్బతినే ప్రమాదముంది.

రోజూ వ్యాయామం చేయనివారు సూట్‌కేస్, నీళ్ల బకెట్ వంటి బరువులను హఠాత్తుగా ఎత్తటమూ నడుం నొప్పికి దారితీయొచ్చు. ఇలాంటి సమయాల్లో పడే ఒత్తిడిని తట్టుకోవటానికి శరీరం సిద్ధంగా లేకపోవటం వల్ల తీవ్రమైన నొప్పి పుడుతుంది.

### కారణాలేంటి?

సరైన పద్ధతిలో బరువులు ఎత్తక పోవటం.

భంగిమ దెబ్బతినటం.

వయసుతో పాటు వెన్నెముక, పూసల మధ్య డిస్కులు అరగటం. ఫలితంగా వెన్నుపాము లేదా నాడుల మీద ఒత్తిడి పడుతుంది. చుట్టుపక్కల ఎముకలు, కండరాలు, కండర బంధనాల వంటివి నాడులను ఒత్తిడి గురి చేయటమూ కారణం కావొచ్చు. దీంతో కిందికి కాళ్లలోకీ నొప్పి (సయాటికా) విస్తరిస్తుంది.

మూత్రకోశ ఇన్‌ఫెక్షన్లు, కిడ్నీలో రాళ్లు కూడా నడుం నొప్పికి దారితీయొచ్చు.

### నివారణ మార్గముంది

బరువును అదుపులో ఉంచుకోవాలి. ఎత్తు, బరువు నిష్పత్తి (బీఎంఐ) 25, అంతకన్నా తక్కువగా ఉండేలా చూసుకోవాలి.

క్రమం తప్పకుండా యోగాసనాలు లేదా కండరాలను సాగదీసే వ్యాయామాలు చేయాలి. ఇవి బరువును తగ్గించనప్పటికీ కదలికలు సాఫీగా సాగటానికి, భంగిమ సజావుగా, శరీరం స్థిరంగా ఉండటానికి తోడ్పడతాయి.

కడుపు, వీపు భాగంలోని కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయాలి.

బరువులను సరైన పద్ధతిలో ఎత్తాలి. నడుమును తిన్నగా ఉంచుతూ.. మోకాళ్లను వంచి, చేతులతో వస్తువులను పట్టుకొని పైకి లేపాలి.


ఎత్తు మడమల చెప్పులు ధరించొద్దు. ఇవి భంగిమను దెబ్బతీస్తాయి.

సిగరెట్ల జోలికి వెళ్లొద్దు. పొగ తాగితే వెన్నెముక, కండరాలకు రక్త సరఫరా తగ్గుతుంది, దెబ్బతిన్న భాగాలు కోలుకోవటం నెమ్మదిస్తుంది.

### చికిత్స ఏంటి?

నడుం నొప్పికి తొలిదశలో గృహ వైద్యం సమర్థంగా పనిచేస్తుంది. తగినంత విశ్రాంతి తీసుకోవటం, వేడితో కాపడం లేదా ఐస్ అద్దటం, క్యాప్‌సైసిన్ వంటి వాటితో కూడిన పూత మందులు, నెమ్మదిగా నడుమును సాగదీయటం, నొప్పి మందులు మేలు చేస్తాయి. అయితే జ్వరం, మొద్దుబారటం, సూదులతో పొడుస్తున్నట్టు అనిపించటం, కాళ్లలోకి నొప్పి పాకటం, కాళ్లు బలహీనం కావటం వంటి లక్షణాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. శారీరక లక్షణాలను పరిశీలించి అవసరాన్ని బట్టి రక్త, ఎక్స్‌రే, సీటీ లేదా ఎంఆర్ఐ పరీక్షలు చేయిస్తారు. నాడుల ద్వారా విద్యుత్ సంకేతాలు ఎంత త్వరగా ప్రసరిస్తున్నాయో తెలిపే పరీక్ష కూడా చేయించొచ్చు. కొన్నిసార్లు పరీక్షల్లో ఎలాంటి కారణమూ బయటపడకపోవచ్చు. దీనికి చికిత్స చేయటం కష్టమవుతుంది కూడా. సాధారణంగా నొప్పి తగ్గించే, కండరాలను వదులు చేసే మందులు ఉపయోగపడతాయి. కొందరికి కొద్ది మోతాదులో కుంగుబాటు మందులూ అవసరమవ్వచ్చు. వీటితో ఉపశమనం కలగకపోతే చివరి మార్గంగా శస్త్రచికిత్స చేస్తారు.

# మిత కాఫీ గుండెకు హితం!



పొద్దున లేవగానే కాఫీ నోట్లో పడకపోతే చాలామందికి రోజు గడవదు. గుక్క గుక్కకూ హుషారు ఊపందుకుంటుంది. కాఫీ చేదు, చక్కెర తీపి, పాల కమ్మదనం కలగలిస్తే చెప్పేదేముంది? అమృతమైనా దిగదుడుపే! ఫిల్టర్ అయితేనేమి? ఇన్‌స్టంట్ అయితేనేమి? దేని రుచి దానిదే. అందుకేనేమో ఒక కప్పుతో సరిపుచ్చటమంటే మనసు చివుక్కుమంటుంది. రోజుకు మూడు నాలుగు సార్లు రుచి చూస్తే గానీ తనివి తీరదు. ఇంతకీ దీంతో ఒనగూరే ప్రయోజనాలేంటి? రోజుకు ఎన్ని కప్పులు లాగించాలి? పాలు, చక్కెర కలపాలా? వద్దా? ఉత్త కాఫీ మాత్రమే తాగాలా? ఇలాంటి ప్రశ్నలెన్నో మనసులో మెదలటం సహజమే. కానీ ఒక్కో పరిశోధన ఒక్కో రకంగా చెబుతుంటే ఎలా? అదృష్టవశాత్తూ అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌కు చెందిన సర్క్యులేషన్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం కొన్ని సందేహాలను నివృత్తి చేసింది. దీన్ని కాఫీ విషయంలో కొత్త శాస్త్రీయ ప్రకటనగానూ పరిగణిస్తుండటం విశేషం.

కాఫీలోని ముఖ్యమైన దినుసు కెఫీనే. మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థను ఉత్తేజితం చేసేది ఇదే. మరింత శక్తిని ఉత్పత్తి చేసేలా, దాన్ని ఇంకాస్త ఎక్కువగా ఉపయోగించుకునేలా శరీరాన్ని ప్రోత్సహిస్తుంది. అందుకే అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, గుండెజబ్బు, పక్షవాతం, గుండె వైఫల్యం, గుండెలయ తప్పటం, ఇతర గుండె సమస్యలపై కెఫీన్ చూపుతున్న ప్రభావం మీద జరిగిన పలు అధ్యయనాలను పరిశోధకులు విశ్లేషించారు. వాటన్నింటినీ గుదిగుచ్చి కొత్త విషయాలను వెలుగులోకి తెచ్చారు.

చాలామందికి రోజుకు 3 నుంచి 5 కప్పుల వరకు (రోజుకు కెఫీన్ 400 ఎంజీ వరకు) బ్లాక్ కాఫీ సురక్షితం. అంటే చక్కెర, తీపి పదార్థాలు, ఫ్లేవర్లు, క్రీమ్ వంటివి కలపని కాఫీ మేలన్నమాట.

బ్లాక్ కాఫీతో టైప్ 2 మధుమేహం, గుండెజబ్బు, పక్షవాతం, గుండె వైఫల్యం, కొన్నిరకాల అస్తవ్యస్త గుండె లయ సమస్యలు, వయసుతో ముడిపడిన డిమెన్షియా, అల్జీమర్స్ వంటి జబ్బుల ముప్పు తగ్గే అవకాశముంది. చక్కెర, రుచికారక సిరప్‌లు, పాలు, క్రీమ్ వంటివి కలిపితే మాత్రం ఈ ప్రయోజనాలు తగ్గొచ్చు. అదనంగా జతచేసే ఇలాంటి పదార్థాల ప్రభావాలను అర్థం చేసుకోవటానికి మరింత పరిశోధన చేయాల్సిన అవసరముందన్నది పరిశోధకుల అభిప్రాయం. వీటితో కేలరీలు ఎక్కువగా లభించటం కారణం కావొచ్చని భావిస్తున్నారు.

పెద్దమొత్తంలో.. ముఖ్యంగా శక్తి పానీయాల్లోని కెఫీన్ గుండెకు హానికరం. వీటిల్లో మామూలు కాఫీతో పోలిస్తే 3-4 రెట్లు ఎక్కువ కెఫీన్ ఉంటుంది.

### కెఫీన్ ప్రభావం ఇలా..

అధిక రక్తపోటు మీద: కెఫీన్ ఎంత తీసుకుంటున్నారనే దాన్ని బట్టి రక్తపోటు మీద ప్రభావం కనిపిస్తోంది. కాఫీతో మొదట్లో తాత్కాలికంగా రక్తపోటు పెరుగుతున్నప్పటికీ.. అలవాటుగా రోజుకు 3 కప్పుల కన్నా ఎక్కువ తాగేవారికి అధిక రక్తపోటు ముప్పు తగ్గుతోంది. అయితే పెద్దమొత్తంలో.. ప్రధానంగా శక్తి పానీయాల వంటి వాటిల్లో ఉండే కెఫీన్‌తో రక్తపోటు గణనీయంగా పెరుగుతోంది. అప్పటికే అధిక రక్తపోటు గలవారిలోనైతే మరింత ఎక్కువవుతోంది.

మధుమేహం మీద: క్రమం తప్పకుండా బ్లాక్ కాఫీ తాగటంతో మధుమేహం ముప్పు తగ్గుతోంది. అయితే ఇందుకు కెఫీన్ కన్నా కాఫీలోని ఇతర పదార్థాలే దోహదం చేస్తున్నాయి.

కొలెస్ట్రాల్ మీద: కాఫీలోని కేఫ్‌స్టాల్ అనే పదార్థంతో చెడ్డ (ఎల్‌డీఎల్) కొలెస్ట్రాల్ ఎక్కువవుతుంది. ఫిల్టర్ చేయని కాఫీలో కేఫ్‌స్టాల్ ఉంటుంది. ఫిల్టర్ లేదా ఇన్‌స్టంట్ కాఫీలో ఉండదు.

గుండెలయ మీద: రోజుకు 1-3 కప్పులు కాఫీతో గుండెలయ తప్పే ముప్పేమీ పెరగటం లేదు. కాకపోతే కింది గుండె గది ఇంకాస్త ముందుగా కొట్టుకునే అవకాశం ఉంటోంది. మరీ పెద్దమొత్తంలో కెఫీన్ తీసుకుంటే మాత్రం గుండె కొట్టుకునే తీరు అస్తవ్యస్తం కావొచ్చు.

గుండెజబ్బు, పక్షవాతం మీద: రోజుకు 2-4 కప్పులు కాఫీ తాగేవారికి గుండెజబ్బు, గుండె వైఫల్యం, పక్షవాతం ముప్పులు తగ్గుముఖం పడుతున్నాయి. అయితే 4 కప్పుల కన్నా ఎక్కువ తాగితే గుండె వైఫల్యం ముప్పు పెరిగే ప్రమాద ముంది.

# వైభవ్ సూర్యవంశీపై తిలక్ వర్మ స్లెడ్జింగ్.. అర్ధశతకం చేజార్చుకున్న యువ సంచలనం.. ఫ్యాన్స్ ఫైర్!

- దులీప్ ట్రోఫీ ఫైనల్లో 15 ఏళ్ల వైభవ్‌పై తిలక్ వర్మ స్లెడ్జింగ్
- 44 పరుగుల వద్ద ఔటైన యువ సంచలనం సూర్యవంశీ
- తిలక్ తీరుపై సోషల్ మీడియాలో అభిమానుల అసంతృప్తి
- మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ మెరుపు అర్ధశతకం (72)



**హైదరాబాద్ పెన్ పవర్:** దులీప్ ట్రోఫీ ఫైనల్లో యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. నేడు సౌత్ జోన్‌తో ప్రారంభమైన ఫైనల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 44 పరుగులు చేసి అర్ధశతకానికి చేరువలో ఔటయ్యాడు. అయితే, అతను ఔటవడానికి ముందు సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మతో జరిగిన ఓ చిన్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తిలక్ వర్మ, వైభవ్‌ను ఉద్దేశించి స్లెడ్జింగ్ చేయగా, ఆ తర్వాత కొద్దిసేపటికే వైభవ్ తన వికెట్ కోల్పోయాడు.మ్యాచ్ సమయంలో తిలక్ వర్మ.. "ఏంటి యార్ ఈ వైస్ కెప్టెన్" అంటూ వైభవ్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం వినిపించింది. అయితే, ఈ సంఘటన తర్వాత ఇద్దరు ఆటగాళ్లు నవ్వుతూ కనిపించడంతో దీన్ని సీరియస్‌గా తీసుకోనట్లు అనిపించింది. కానీ, సోషల్ మీడియాలో మాత్రం అభిమానులు తిలక్ తీరును తప్పుబడుతున్నారు. 15 ఏళ్ల కుర్రాడిపై స్లెడ్జింగ్ వ్యూహం అవలంబించడం సరికాదని పలువురు విమర్శలు గుప్పించారు. ఈ స్లెడ్జింగ్ తర్వాత చామ మిలింద్ బౌలింగ్‌లో వైభవ్ ఔటయ్యాడు.అంతకుముందు వైభవ్ తన ఇన్నింగ్స్‌ను ఎంతో దూకుడుగా ప్రారంభించాడు. భారత సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లోనూ అద్భుతమైన షాట్లు ఆడాడు. మొత్తం మీద 5 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 44 పరుగులు సాధించాడు. వైభవ్ దూకుడైన ఆటతీరు మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్‌పైనా ప్రభావం చూపినట్లు కనిపించింది. ఈశ్వరన్ కూడా దూకుడుగా ఆడి 86 బంతుల్లో 10 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 72 పరుగులు చేసి రనౌట్‌గా వెనుదిరిగాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో శుభారంభం చేసింది.

# సాత్విక్-చిరాగ్ సంచలనం.. చైనా మాస్టర్స్ టైటిల్ సొంతం

- చైనా మాస్టర్స్ సూపర్ 750 టైటిల్‌ను గెలుచుకున్న సాత్విక్-చిరాగ్
- ఫైనల్‌లో చైనా జోడీపై హోరాహోరీ పోరులో విజయం
- తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం
- ఈ సీజన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్
- గాయాలతో బాధపడుతున్నా అద్భుత ప్రదర్శన కనబర్చిన భారత జోడీ



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత స్టార్ బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి సంచలనం సృష్టించారు. ప్రతిష్ఠాత్మక చైనా మాస్టర్స్ సూపర్ 750 పురుషుల డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. షెన్‌జెన్‌లోని అరీనాలో ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్‌లో చైనా జోడీ హీ జి టింగ్, రెన్ జియాంగ్ యూపై 11-21, 21-13, 21-17 తేడాతో అద్భుత విజయం సాధించారు.గంటా 10 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించింది. తొలి గేమ్‌లో చైనా జోడీ తమ వేగం, తెలివైన షాట్లతో పూర్తి ఆధిపత్యం చెలాయించింది. దీంతో సాత్విక్-చిరాగ్ 11-21 తేడాతో సులభంగా గేమ్‌ను కోల్పోయారు. అయితే, రెండో గేమ్‌లో భారత ద్వయం అద్భుతంగా పుంజుకుంది. తమ అనుభవాన్ని రంగరించి, ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచి 21-13తో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లారు.నిర్ణయాత్మక మూడో గేమ్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. తొలుత చైనా జోడీ 4-0 ఆధిక్యంతో దూకుడుగా ప్రారంభించినా, సాత్విక్-చిరాగ్ ఏ దశలోనూ పట్టు వదల్లేదు. స్కోరు 17-17తో సమమైన కీలక దశలో భారత ద్వయం వరుసగా నాలుగు పాయింట్లు సాధించి 21-17తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకుంది.ఈ సీజన్‌లో సింగపూర్ ఓపెన్ తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇది రెండో టైటిల్ కావడం విశేషం. ఇటీవలి టోర్నీలలో నిరాశపరిచినప్పటికీ, ఈ విజయంతో వారు తిరిగి ఫామ్‌లోకి వచ్చారు. భుజం నొప్పితో సాత్విక్, వెన్ను నొప్పితో చిరాగ్ బాధపడుతున్నా... గాయాలను లెక్కచేయకుండా వారు ప్రదర్శించిన పోరాట పటిమ అభిమానులను ఆకట్టుకుంది.

# నా రిటైర్మెంట్ ఎప్పుడో నాకే తెలుసు.. రోహిత్‌పై ఆగని రూమర్లు: బీసీసీఐ మీటింగ్‌లో అసలేం జరిగింది?





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్‌లో ఒక ఆటగాడు తోటి ప్లేయర్లతో కలిసి బాల్కనీలో కూర్చున్నా, లేదా కుటుంబ సభ్యులు ఐపీఎల్ మ్యాచ్‌కు వచ్చినా.. ఆఖరికి ఏదైనా రియాలిటీ షోలో కనిపించినా దానిని రిటైర్మెంట్ సంకేతంగా భావించడం పరిపాటిగా మారింది. రోహిత్ శర్మ విషయంలోనూ ప్రస్తుతం అదే జరుగుతోంది. శుభ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రోహిత్ భవిష్యత్తుపై రకరకాల పుకార్లు షికారు చేస్తున్నాయి. కానీ ఇంగ్లాండ్ పర్యటనలో లార్డ్స్ మైదానంలో ప్రదర్శతో హిట్ మ్యాన్ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. బయట వస్తున్న విమర్శలపై స్పందిస్తూ శబ్దాలు (నాయిస్) లేకపోతే అందులో మజా ఉండదని రోహిత్ ఆ వార్తలని కొట్టిపారేశాడు.

**బీసీసీఐ రివ్యూ మీటింగ్ సంచలనం.. సెలెక్టర్ల ఒత్తిడి నిజమేనా?:**
రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై ఇటీవల ముంబైలో జరిగిన బీసీసీఐ రివ్యూ మీటింగ్‌లో చర్చ జరిగినట్లు వార్తలు రావడం వాతావరణాన్ని మరింత వేడెక్కించింది. బోర్డులోని ఒక సెలెక్టర్ రోహిత్‌ను రిటైర్ అవ్వాలని కోరినట్లు, దానికి హిట్ మ్యాన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు, ఆ తర్వాత పెద్దల జోక్యంతో సర్దుమనిగిందంటూ రకరకాల వర్షన్లు ప్రచారంలోకి వచ్చాయి. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ మీటింగ్‌కు హాజరుకాకపోవడంపై కూడా అనేక అంచనాలు వెలువడ్డాయి. కానీ బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందిస్తూ అసత్య ప్రచారాలను నమ్మవద్దని, ఆధారాలు లేని వార్తలను వ్యాప్తి చేయవద్దని స్పష్టం చేశారు.

**వడాపావ్ మానేసి పక్కా ఫిట్‌నెస్.. కంబ్యాక్ కోసం తీవ్ర శ్రమ:**
11,000 పైగా వన్డే పరుగులు, మూడు డబుల్ సెంచరీలు, ఛాంపియన్స్ ట్రోఫీ, టీ20 వరల్డ్ కప్ వంటి చారిత్రాత్మక విజయాలను భారత్‌కు అందించిన రోహిత్ శర్మ, తన రిటైర్మెంట్ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో నిర్ణయించుకునే హక్కును సంపాదించుకున్నాడు. రిటైర్ అవ్వడానికి తాను ఇంకా రెడీగా లేనని అతని చర్యలే నిరూపిస్తున్నాయి. రోహిత్ తనకు ఎంతో ఇష్టమైన వడాపావ్‌ను కూడా త్యాగం చేసి, బరువు తగ్గి మైదానంలో మరింత వేగంగా కదిలేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. డొమెస్టిక్ క్రికెట్ ఆడేందుకు సైతం ఆసక్తి చూపిస్తూ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే కసి తనలో ఇంకా ఉందన్నాడు.

**జైస్వాల్ సిద్ధమే.. రోహిత్‌ను బలవంతంగా తప్పించాలా?:**
భారత క్రికెట్ భవిష్యత్తు కోసం యశస్వి జైస్వాల్ వంటి యువ కిరణాలు సిద్ధంగా ఉన్న మాట వాస్తవమే, సెలెక్టర్లు కూడా 2027 వన్డే ప్రపంచకప్ దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రచించడంలో తప్పులేదు. కానీ ఉత్తమ ఫామ్, ఫిట్‌నెస్‌తో ఉన్న రోహిత్ శర్మను బలవంతంగా బయటకు పంపడం సరైన పద్ధతి కాదని క్రీడా పండితులు పేర్కొంటున్నారు. జైస్వాల్‌ను జట్టుతో పాటు ప్రయాణింపజేస్తూ, తగినన్ని లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడిస్తూ వారసుడిగా తీర్చిదిద్దడం సెలెక్టర్ల బాధ్యత. అంతే తప్ప ప్రతి మ్యాచ్‌నూ రోహిత్ కు రిటైర్మెంట్ పరీక్షగా మార్చడం సరికాదు. ఆటగాడిగా తాను వైదొలగాలని భావించిన రోజు హిట్ మ్యాన్ స్వయంగా ఆ నిర్ణయాన్ని ప్రకటించనున్నాడు.


# 2026లో అదిరిపోయే కంబ్యాక్ ఇచ్చిన సౌత్, నార్త్ హీరోలు!











చిత్ర పరిశ్రమలో గెలుపోటములు సహజం. వరుస పరాజయాలు ఎదురైనప్పుడు ఆ హీరో పనైపోయిందని విమర్శ కులు పెదవి విరిచిన వేళ తమ అసలైన స్టామినాతో తిరిగి పుంజుకోవడమే నిజమైన స్టార్‌డమ్. 2026 నాటి చరిత్రను పరిశీలిస్తే సౌత్ నుంచి నార్త్ వరకు పలువురు అగ్ర కథానాయకులు వరుస ఫ్లాపుల నుంచి తేరుకుని ఊహించని రీతిలో బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో ఖతర్నాక్ కంబ్యాక్ ఇచ్చారు.మాస్ మహారాజా రవితేజకు ఇటీవల ఎదురైన కొన్ని పరాజయాల తర్వాత ఆయన మార్కెట్ తగ్గిందనే విమర్శలు వినిపించాయి. అయితే ఆ విమర్శలన్నింటికీ చెక్ పెడుతూ ఆయన నటించిన -ఇరుముడి- చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. నిర్మాతలు, డిస్ట్రి బ్యూటర్లకు ఏకంగా 100 కోట్ల నికర లాభాలను తెచ్చిపెట్టి రవితేజ మాస్ పవర్‌ను మరోసారి నిరూపించింది.కోలీవుడ్ వర్సటైల్ నటుడు సూర్య సైతం కొన్ని ఫ్లాపుల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ 2026 ఆయన కెరీర్‌లోనే గోల్డెన్ ఇయర్‌గా నిలిచింది. సూర్య నటించిన -కరుపు- బాక్సాఫీస్ వద్ద 300 కోట్ల అసాధారణ వసూళ్లను పాధించింది. ఆ వె వెంటనే రిలీజ్ అయిన -విశ్వనాథ్ అండ్ సన్స్- 240 కోట్ల భారీ వసూళ్లను సాధించింది. ఇలా ఒకే ఏడాదిలో రెండు భారీ హిట్ల ద్వారా సూర్య పవర్ఫుల్ కంబ్యాక్ ఇచ్చారు.మాలీవుడ్ లో -ప్రేమమ్- చిత్రంతో సంచలనం సృష్టించిన నివిన్ పౌలీ ఆ తర్వాత సరైన విజయం లేక వెనుకబడ్డారు. అయితే ఆయన కథానాయకుడిగా వచ్చిన -బెత్లహం కుటుంబ యూనిట్- చిత్రం మాలీవుడ్ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇటీవల రిలీజ్ అయిన ఈ సినిమా ఏకంగా 200 కోట్ల వసూళ్లతో నివిన్ పౌలీ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.బాలీవుడ్‌లో కూడా ఒకప్పటి మాస్ హీరో ఇమ్రాన్ హాష్మీ రీ-ఎంట్రీ సరికొత్త చరిత్రను తిరగరాసింది. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన నటించిన -ఆవారాపన్ 2- చిత్రం థియేటర్లలో సరికొత్త ఊపును తీసుకొచ్చింది. తన మార్కు డైలాగ్ డెలివరీ, మ్యూజిక్, నటనతో ఇమ్రాన్ హాష్మీ బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద పవర్ఫుల్ మాస్ కంబ్యాక్‌ను నమోదు చేశారు. అలా నలుగురు హీరోలకు 2026 మరో మైలురాయిగా నిలిచిపోతుంది. సరైన కథ, పాత్ర పడితే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని సాధించిన విజయాలు నిరూపించాయి. విమర్శించిన నోళ్లే ప్రశంసలు కురిపించాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965